

న్యాయాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాజగోపాల్

ఏకగ్రీవంగా ఎన్నికైన ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి

ఖమ్మం లీగల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): న్యాయాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజ గోపాల్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సంఘానికి అధ్యక్ష ఎన్నికకు ఈనెల 19న పోలింగ్, 27న ఓట్ల లెక్కింపు హైదరాబాద్‌లో జరగనుంది. దానికి సంబంధించిన నామినే షన్ల దాఖలు ప్రక్రియ మంగళవారం ముగి యగా.. (మిగతా 6వ పేజీలో)

ఖమ్మం- కొదుమూరు మధ్య..

నాలుగు వరుసల రహదారి

రూ.27.37కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

చింతకాని, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని ముస్తాఫా నగర్ నుంచి చింతకాని మండలం కొదుమూరు గ్రామం వరకు ప్రస్తుతం రెండు వరుసలుగా ఉన్న ఆర్‌అండ్‌బీ రహదారి నాలుగు వరుసల రహదారిగా మార నుంది. ఇందుకోసం ప్రభుత్వం రూ.27.37కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. రహదారిపై డివైడర్, సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేయనున్నారు. నాలుగు వరుసల రహ దారి నిర్మాణంతో చింతకాని, బోనకల్, కొణిజర్ల మండల ప్రజలకు ఖమ్మం ప్రయాణం మరింత సులువు కానుంది. ఇక ఈ రోడ్డు విస్తరణ, నిధుల మంజూరుకు కృషి చేసిన ఉపముఖ్య మంత్రి మల్లు భట్టి విక్రమార్కకు చింతకాని మండల నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

మొర వినేదెవరు?

భద్రాద్రి దేవస్థానానికి సంబంధించి ఏపీలోని అల్లూరి జిల్లా యటపాక మండలం పురుషోత్తపట్నం గ్రామంలో ఉన్న భూముల సమస్యకు పరిష్కారం ఎప్పుడు లభిస్తుందని రామ భక్తులు ప్రశ్నిస్తున్నారు. అక్కడ దేవస్థానానికి 889.50 ఎకరాల భూమి ఉండగా అందులో 90శాతానికి పైగా ఆక్రమణలోనే ఉంది. ముఖ్యంగా 2019 నుంచి అక్కడ రామయ్య భూముల్లో ఆక్రమణలు అక్రమ నిర్మాణాలు విచ్చలవిడిగా సాగు తుండగా దీనిపై అక్కడి రెవెన్యూ, పోలీసు అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఏమాత్రం స్పందన లేదని దేవస్థానం వర్గాలు ఆరోపిస్తున్నాయి.



నిరసన తెలుపుతున్న టీఎన్‌జీవో, దేవస్థానం ఉద్యోగులు

- భద్రాద్రి దేవస్థానం భూముల సమస్యకు శాశ్వత పరిష్కారమెన్నడు
- విస్మయం కలిగిస్తున్న ఏపీ పోలీసు, రెవెన్యూ అధికారుల తీరు
- ఫిర్యాదులకు కనీసం రశీదులూ ఇవ్వని వైనం
- యథేచ్ఛగా దాడులు జరుగుతున్నా పట్టింపులేదు
- ఈవోపైనే దాడి చేసే స్థాయికి ఆక్రమణదారుల బరితెగింపు
- రెండు ప్రభుత్వాల చొరవతోనే పరిష్కారం
- దేవస్థానం ఈవో, సిబ్బందిపై దాడికి పలువురి నిరసన
- భద్రాద్రి రామయ్య భూమి అంగుళం కూడా వదలం : వీహెచ్‌పీ

భద్రాచలం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఏపీ పురుషోత్తప ట్నంలోని భద్రాద్రి రామయ్యకు చెందిన భూములను కబ్జా దారుల నుంచి కాపాడేందుకు అక్కడికి వెళ్లిన ఆలయ ఈవో రమాదేవి, సిబ్బందిపై జరిగిన దాడి నేపథ్యంలో రెండు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ విషయంపై సీరియస్‌గా దృష్టి సారిస్తేనే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని భక్తులు పేర్కొంటున్నారు. దాడి జరిగిన విషయం తెలిసిన వెంటనే తెలంగాణ రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కతో రామయ్య భూముల పరిరక్షణ విషయమై మాట్లాడారు. అలాగే ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సైతం ఈ సమస్య పరిష్కారా నికి చొరవ చూపాలని ఆమె కోరారు. అయితే ఇరు రాష్ట్రాల సీఎంలు, మంత్రులు, ప్రధాన కార్యదర్శుల స్థాయిలో నిర్ణయం తీసుకుంటేనే దీనికి శాశ్వత పరిష్కారం లభిస్తుం దని పలువురు పేర్కొంటున్నారు. రామయ్య భూములకు రక్షణ కల్పించాలని 2022లో ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయ మూర్తి ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కోరుతూ ఏపీ మంత్రులు, దేవాదాయ శాఖ అధికారులు, ఇతర ఉన్నతాధి కారులను భద్రాద్రి దేవస్థానం ఈవోలు పలుమార్లు కలిసి కోరినా ఆ ప్రయత్నాలేవీ ఫలించలేదు. ఈ నేపథ్యంలో దక్షిణ అయోధ్యగా విరాజిల్లుతున్న భద్రాచల రామయ్య భూముల పరిష్కారం చేపట్టేందుకు సత్వరమే ఇరు రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలనే డిమాండ్ జోరందుకుంది.

ఎంతటి ఉద్యమానికైనా సిద్ధం : వీహెచ్‌పీ

భద్రాద్రి రామయ్యకు చెందిన భూమిలో అంగుళం కూడా వదిలేది లేదని విశ్వహిందూ పరిషత్ ప్రచార ప్రముఖ్ పగుడాగుల బాలస్వామి స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన ఒక వీడియో సందేశాన్ని స్థానిక మీడియా ప్రతిని ధులతో పాటు దేవస్థానం అధికారులకు పంపారు. 917ఎక రాల భూమిని ఒక దాత రాముడిపై భక్తితో దానం చేస్తే నేడు కొందరు కబ్జా చేస్తున్నారని విమర్శించారు. కబ్జాదా రులు చెలరేగి ఏకంగా అధికారులపై దాడికి దిగడం అత్యంత హేయమైన చర్యన్నారు. రామయ్య భూముల పరి రక్షణకు ఎంతటి ఉద్యమానికైనా విశ్వహిందూ పరిషత్ సిద్ధంగా ఉందన్నారు. ఈ విషయంలో రెండు తెలుగు ప్రభు త్వాలు చొరవ తీసుకొని రామయ్య భూములను కాపాడాలని ఆయన డిమాండ్ చేశారు. ఇదిలా ఉండగా భూముల పరిర క్షణకోసం వెళ్లిన దేవస్థానం ఈవో, సిబ్బందిపై దాడిని మాజీ ఎమ్మెల్సీ, బీజేపీ తెలంగాణ (మిగతా 6వ పేజీలో)

వెల్లువెత్తిన నిరసనలు

భద్రాద్రి దేవస్థానం ఈవో ఎల్.రమాదేవి, సిబ్బం దిపై జరిగిన దాడిని నిరసిస్తూ బుధవారం పలు వురు నిరసన తెలిపారు. భద్రాచలంలోని తానీషా మండపం ఎదుట టీఎన్‌జీవో, టీజీవో, దేవస్థానం ఉద్యోగుల సంక్షేమ సంఘం, విశ్రాంత ఉద్యోగులు, దేవాదాయ శాఖ ఉద్యోగ జేఏసీ తదితర సంఘాల ఆధ్వర్యంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలి పారు. అదేవిధంగా భద్రాచలంలోని పట్టణ విశ్వబ్రా హ్మణ సంఘం, శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ కమిటీ, వెంకటేశ్వర కార్పెంటర్స్ యూనియన్‌ల ఆధ్వ ర్యంలో దేవస్థానం అధికారులు, సిబ్బందిపై దాడిని నిరసించారు. ఇటువంటి దురదృష్టకరమైన ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకో వాలని వారు కోరారు.

రైతు సమస్యలకు సత్వర పరిష్కారం



- అవసరమైన చోట సొసైటీల ఆధ్వర్యంలో ఎరువుల విక్రయాలకు సబ్‌సెంటర్లు
- ఏఈవో స్థాయిలో వాట్సాప్ గ్రూపులు
- హలో.. జిల్లా వ్యవసాయాధికారి కార్యక్రమానికి విశేష స్పందన

'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌లో జేడీఏ ధనసరి పుల్లయ్య

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

వానాకాలం సాగు ముమ్మరమైంది. విభిన్న పంటలకు నిలయమైన ఉమ్మడిజిల్లా రైతులు సాగులో ముందుంటారు. అయితే ఇటీవల సంప్రదాయ పంటలకు తోడు పత్తి, మిర్చి లాంటి మెట్టపంటలు వేస్తున్నారు. ఇటీవల ఆయిల్‌పాం వైపు ఆసక్తి మరింది. ఈ క్రమంలో వానాకాలం సాగుకు సంబంధించి రైతులు ఎదుర్కొంటున్న సమ స్యలు, వారిలో ఉన్న సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' బుధవారం హలో జిల్లా వ్యవసాయధికారి పేరుతో ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. ఫోన్‌చేసిన రైతులకు జిల్లా వ్యవసాయాధికారి (జేడీఏ) డి.పుల్లయ్య సమాధానాలు, సూచనలు, సలహాలు ఇచ్చారు. ఖమ్మం కలెక్టరేట్‌లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 11గంటల వరకు జరిగిన ఈ కార్యక్రమంలో జేడీఏతో పాటు జిల్లా వ్యవసాయ సహాయ సంచాల కులు వాసవీరాణి, ఏవోలు పవన్‌కుమార్, ప్రత్యూష కూడా పాల్గొన్నారు. 6

- ఆంధ్రజ్యోతిప్రతినిధి, ఖమ్మం

నేడు వెంకటాపురంలో

దమ్మక్క సేవా యాత్ర

భద్రాచలం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): భద్రాచల సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ములుగు జిల్లా వెంకటాపురంలో గురువారం దమ్మ క్క సేవా యాత్ర నిర్వహించనున్నారు. అక్కడి వెంకటేశ్వరస్వామి ఆలయం లో కల్యాణోత్సవం నిర్వహించేందుకు ప్రచారరథంతో పాటు దేవస్థానం అధి కారులు, పరిపాలన, వైదిక సిబ్బంది బుధవారం తరలివెళ్లారు. గురువారం కల్యాణం అనంతరం ప్రసాదం, స్వామి వారి అన్నప్రసాదం భక్తులకు అంద జేయనున్నారు. అదేవిధంగా భద్రాచలంలోని రామయ్య సన్నిధిలో దమ్మక్క చిత్రపటంతో గిరి ప్రదక్షిణ, దమ్మక్క విగ్రహానికి పూజలు నిర్వహించను న్నారు. అనంతరం ఆలయంలో స్వామి వారి కల్యాణం నిర్వహించనున్నారు.

ఆలయాల భూములను

పరిరక్షించాలి

- అందుకోసం స్పెషల్ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలి
- రాజకీయ నాయకుల పేర్లతో దేవాదాయ శాఖ ఉద్యోగులకు బెదిరింపులు
- దేవాదాయ శాఖ మంత్రి స్పందించినా అధికారులు స్పందించరా?
- విలేకరుల సమావేశంలో దేవాదాయ శాఖ ఉద్యోగ, అర్చక సంఘాల నాయకులు
- ఈవో రమాదేవిపై జరిగిన దాడికి ఖండన.. ఉమ్మడి జిల్లాలో నిరసనలు



ఖమ్మంలో మాట్లాడుతున్న ఉద్యోగ, అర్చక సంఘాల జేఏసీ నాయకులు

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని ఆలయాల భూములను పరిరక్షించాలని, ఇందుకోసం స్పెషల్ టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేయాలని ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉద్యోగ, అర్చక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. ఏపీ పురుషోత్తపట్నంలోని భద్రాచలం సీతారామచంద్రస్వామి దేవస్థానం భూములను కబ్జాదారుల నుంచి భూమిని కాపాడేందుకు ప్రయత్నించిన క్రమంలో కబ్జా దారులు ఈవో రమాదేవిపై దాడి పాల్పడి వారు తీవ్రంగా ఖండించారు. బుధవారం ఖమ్మం గుంటుమల్లేశ్వర స్వామి ఆలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని దేవా లయ భూములు సుమారు 12వేల ఎకరాలు ఆక్రమణలో ఉన్నాయని వాటిని సర్వే చేసి ఆల యాలకు అప్పగించేందుకు వెళ్లిన దేవాదాయ, ధర్మాదాయ ఉద్యోగులపై భూకబ్జాదారులు దాడులకు (మిగతా 6వ పేజీలో)



ఖమ్మంలో వామపక్ష పార్టీల ప్రదర్శన




కొత్తగూడెంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

సమ్మె సక్సెస్

- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నిరసనలు, ర్యాలీలు
- నిలిచిన ఆటోలు, 50 శాతం నడిచిన ఆర్టీసీ సర్వీసులు
- సమ్మెలో పాల్గొన్న సింగరేణి, బ్యాంకు ఉద్యోగ, కార్మిక సంఘాలు
- లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక నేతల డిమాండ్

ఖమ్మం, జూలై 9(ఆంధ్రజ్యోతి): లేబర్ కోడ్‌ల కుదింపు ఆలోచ నను విరమించుకోవాలనే డిమాండ్‌తో చేపట్టిన సార్వత్రిక సమ్మె ఉమ్మడి ఖమ్మం జిల్లాలో విజయవంతమైంది. ఉదయం నుంచే పలు వామపక్ష పార్టీల కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బంద్ కొన సాగింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని ప్రధాన కేంద్రా లతోపాటుగా, మండల కేంద్రాల్లో ర్యాలీలు నిర్వహించి, నిరస నలు చేపట్టారు. రెండు జిల్లాల్లోనూ ఆటో యూనియన్లు పూర్తి స్థాయిలో మద్దతు ప్రకటించగా, ఆర్టీసీకి సంబంధించి 50శాతం సర్వీసులు నడిచాయి. ఖమ్మం రీజియన్ పరిధిలో ప్రతీరోజు 490 సర్వీసులు నడుస్తుండగా బుధవారం సమ్మె ప్రభావంతో 210 సర్వీసులు మాత్రమే నడిచాయి. దాంతో రోజుకు రూ.1.50కోట్లు వరకు ఆదాయం రావాల్సి ఉండగా, 50శాతం ఆదాయం పడిపో యింది. ఖమ్మం నుంచి హైదరాబాద్, సత్తుపల్లి, ఇల్లెందు, భద్రా చలం ప్రాంతాలకు వెళ్లే బస్సులు నిలిచిపోయాయి. ఖమ్మంలో ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ, సీఐటీయు, టీయుసీఐ, ఇఫ్టూ, బీఆర్ టీయు, టీఎన్‌టీయూసీ, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వ ర్యంలో పెవిలియన్ మైదానం నుంచి జడ్పీ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో సీపీఎం పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి భాగం హేమంతరావు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వర రావు, న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి మధు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కొత్త సీతారాములు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ సర్కార్ కార్మిక చట్టాలను మార్చాలనుకోవడం దేశానికి ప్రమాదకరమన్నారు. పని పరిస్థితి బాగోలేకపోతే గతంలో అందరూ కలిసి సమ్మె కట్టే అవకాశం ఉండేదన్నారు. కానీ ప్రస్తుతం అలాంటి సంఘాలను తీసేయడం ద్వారా సమ్మె చేసే హక్కును కాలరాస్తున్నారన్నారు. ఒకసారి ఉద్యోగంలో చేరితే, పర్మినెంట్ అయితే వృద్ధులైతే పింఛ న్, మరణిస్తే నష్టపరిహారం వస్తుందన్నారు. కానీ ఇప్పుడు ఉద్యో గులను పర్మినెంట్ చేసే విధానమే లేదన్నారు. ఇది కేవలం కార్మి కుల సమ్మె మాత్రమే కాదని, రైతులకు కనీస మద్దతు ధర కావాలనే డిమాండ్‌లతో సమ్మె సాగుతోందన్నారు. సమ్మెద్వారా కేంద్ర ప్రభుత్వానికి కనువిప్పు కలగాలన్నారు. బ్యాంకు ఉద్యో గులు కూడా సమ్మెలో పాల్గొన్నారు. ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో వరంగల్ క్రాస్ రోడ్డులో (మిగతా 6వ పేజీలో)



భద్రాద్రి వద్ద 24.1 అడుగులకు గోదావరి

భద్రాచలం, జూలై 9 (ఆంధ్రజ్యోతి) ఎగువన కురిసిన వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గత 24గంటల్లో స్వల్పం గా పెరిగింది. మంగళ వారం సాయంత్రం 19.8 అడుగు లున్న గోదావరి నీటిమట్టం అర్ధ రాత్రి 12 గంటలకు 20.5అడుగు లకు చేరుకోగా.. బుధవారం ఉదయం 6 గంటలకు 22.4అడు గులు, మధ్యాహ్నం 12గంటలకు 23.7అడుగులు, 3 గంటలకు 24అడుగులకు చేరుకుంది. సాయంత్రం 4 గంటలకు 24.1అడుగులకు పెరిగిన నీటి మట్టం రెండు గంటల పాటు నిలకడగా ఉంది. ఇదిలా ఉండగా గురువారం సాయంత్రం నుంచి గోదావరి నీటిమట్టం స్వల్పంగా పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధి కార వర్గాలు అంచనా వేస్తు న్నాయి.

విద్యుత్ సరఫరా.. మరింత మెరుగ్గా..

- జిల్లాకు 18 విద్యుత్ ఉప కేంద్రాలు మంజూరు
- పట్టణాల నుంచి పల్లెల వరకు 'డిమాండ్' ప్రాంతాల గుర్తింపు
- నగరంలో ఇండోర్ ఉపకేంద్రానికి ప్రతిపాదనలు పూర్తి



నిర్మాణం పూర్తయిన విద్యుత్ ఉపకేంద్రం

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): రోజు రోజుకూ విద్యుత్ వినియోగం పెరుగుతుండటంతో.. డిమాండ్ మేరకు విద్యుత్ పంపిణీ చేసేందుకు టీజీ ఎన్పీడీసీఎల్ సంస్థ చర్యలు చేపట్టింది. అయితే విద్యుత్ పవర్ గ్రిడ్ నుంచి వచ్చిన విద్యుత్‌ను స్థానికంగా నిల్వ ఉంచి విద్యుత్ అవసరాలకు వినియోగించేందుకు విద్యుత్ ఉపకేంద్రాలు అవసరం. రెండు దశాబ్దాల క్రితం ఒక్కో మండల కేంద్రానికి ఒకటి, రెండు విద్యుత్ ఉప కేంద్రాల ద్వారా విద్యుత్ పంపిణీ జరిగింది. అయితే ఇప్పుడు గృహ, వ్యాపార, పరిశ్రమలు, వ్యవసాయం ఇలా అనేక రంగాలు విద్యుత్‌పై ఆధారపడ్డాయి. దీంతో ప్రతీ మండలంలో 6నుంచి 7విద్యుత్ కేంద్రాలను నిర్మించాల్సి వస్తోంది.

ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 125విద్యుత్ ఉపకేంద్రాల ద్వారా విద్యుత్ పంపిణీ జరుగుతోంది. అయితే పట్టణ, గ్రామీణ ప్రాంతాలు తేడా లేకుండా విద్యుత్ వినియోగం పెరిగి డిమాండ్ అనూహ్యంగా పెరిగింది. సాధారణ రోజుల్లో రోజుకు 5మిలియన్ యూనిట్లు వినియోగం కాగా వ్యవసాయ సీజన్‌లో 7మిలియన్ యూనిట్లు, వేసవిలో 8మిలియన్ యూనిట్లు విద్యుత్ వినియోగం జరుగుతోంది. విద్యుత్ డిమాండ్ సమయంలో పంపిణీకి కావాల్సిన ఉపకేంద్రాలపై సర్వే చేశారు. ముందుముందు ఆరు నెలల్లో పెరిగే డిమాండ్ ఆధారంగా విద్యుత్ ఉపకేంద్రాలు (మిగతా 6వ పేజీలో)

రైతు సమస్యలకు సత్వర పరిష్కారం


ఫోన్ ఇన్ కార్యక్రమంలో పాల్గొన్న వ్యవసాయ అధికారులు

» 'ఆంధ్రజ్యోతి' ఫోన్ ఇన్‌లో ఖమ్మం జేడీఏ ధనసరి పుల్లయ్య
» హలో... జిల్లా వ్యవసాయాధికారి కార్యక్రమానికి విశేష స్పందన

ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

ఖమ్మం, జూలై 9 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : ఉమ్మడి జిల్లా రైతులు విభిన్న పంటల సాగులో ప్రత్యేకతను చాటుకుంటూ ఉంటారు. సంప్రదాయ పంటలకు తోడు పత్తి, మిర్చి లాంటి మెట్టపంటలు వేడయంలో దిట్టగా పేరొందారు. ఇదే సమయంలో ఆయిల్‌పాం లాంటి వాణిజ్య పంటల సాగు వైపు కూడా ఆసక్తి చూపుతున్నారు. కానీ సాగుకు సంబంధించి ఎన్నో సమస్యలు ఎదుర్కొంటూనే ఉన్నారు. అలా వారిలో ఉన్న సందేహాలను నివృత్తి చేసుకునేందుకు 'ఆంధ్రజ్యోతి' బుధవారం హలో జిల్లా వ్యవసాయధికారి పేరుతో ఫోన్‌ఇన్ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి రైతుల నుంచి విశేష స్పందన వచ్చింది. రైతులకు ఖమ్మం జిల్లా వ్యవసాయాధికారి (జేడీఏ) డి.పుల్లయ్య సమాధానాలు, సూచనలు, సలహాలు ఇచ్చారు.

● ఖమ్మం అర్బన్ రైతుల వివరాలు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదవడం లేదు. నాకు ఎకరంన్నర భూమి ఉంది. నా భార్య పేరిట కూడా ఉంది. ఫార్మర్ రిజిస్ట్రీలో ఆధార్ లింక్ కావడంలేదు

- యలమద్ది నారాయణరావు, ఖమ్మం ఖానాపురంహవేలి

డీఏవో: కొన్ని గ్రామాలకు చెందిన ఆధార్ కార్డులు సాంకేతిక పరంగా లింక్ కావడంలేదు. ఇది కేంద్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న కార్యక్రమం. ఈ సమస్యను రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి.. పరిష్కరించేందుకు కృషి చేస్తాం

●ఎరువులకు లింక్‌లు పెడుతున్నారు. యూరియా కావాలంటే ఇతర ఎరువులుకొనాలంటున్నారు. అది మాకు భారంగా మారుతోంది.

- బోయినపల్లి కృష్ణ, కూసుమంచి, నర్సింహులగూడెం

డీఏవో: ఎరువుల కోసం కంగారుపడాల్సిన అవసరంలేదు. సరిపడా ఎరువులున్నాయి. కావాల్సిన మేరకే కొనాలి. ఒకేసారి ఎక్కువ మొత్తంలో కొనడంతో ఇబ్బందులు వస్తాయి. ఒక ఎరువుకు మరో ఎరువుకు ఎలాంటి లింక్‌లు లేవు.

● నాకు టేకులపల్లి సొసైటీలో రూ.లక్షా27వేల రుణం ఉంది. కానీ మాఫీ కాలేదు. మణుగూరులో రుణం తీసుకున్నట్టు ఉందని చెప్పడంతో బ్యాంకు అధికారులకు నోడ్యూ సర్టిఫికెట్ ఇచ్చా. కానీ ఫలితం లేదు. ఆధార్ నెంబరు ఒక్కటే ఉండటంతో మాఫీకాలేదని చెప్పారు. సమస్య పరిష్కరించండి

- రాయళ్ల శ్రీనివాసరావు, గువ్వలగూడెం, నేలకొండపల్లి మండలం

డీఏవో: జరిగిన విషయాన్ని రాతపూర్వకంగా మండల వ్యవసాయాధికారికి ఇవ్వండి. అలాగే మీ ఆధార్ కార్డు జిరాక్సుతో పాటు జిల్లా కార్యాలయంలో కూడా దరఖాస్తు చేయండి.

● సాగర్ నుంచి నీరు ఎప్పుడు వదులుతారో చెప్పడం లేదు. దుక్కులు దున్ని సిద్దంగా ఉంచాం.. ముందుగా నీరు వదిలితే దిగుబడులు మంచిగా వస్తాయి. తెగుళ్లు ఉండవు. అలాగే కొన్ని సీడ్ కంపెనీలు మొక్కజొన్నలకు అగ్రిమెంట్ చేయకుండానే రైతులతో వేయిస్తున్నారు.

- స్వర్ణ సుబ్బారావు, పెద్దగోపతి, కొణిజర్ల మండలం

డీఏవో: నీటిపారుదల శాఖ అధికారులతో మాట్లాడి దీనిపై అధికారిక ప్రకటన చేస్తాం. నీరు వస్తే ముందుగానే విడుదల ఉంటుంది. అలాగే రైతులెవరూ కార్పొరేట్ కంపెనీల వద్ద అగ్రిమెంట్ తీసుకోకుండా విత్తనపంటలు వేయవద్దు. అగ్రిమెంట్ లేకపోతే నష్ట పరిహారం పొందే పరిస్థితి ఉండదు. చివరిలో కంపెనీలు మోసంచేశాయని ఫిర్యాదు చేసినా ఫలితం ఉండదు. బహుళ జాతి కంపెనీలు తప్పనిసరిగా రైతులతో కొనుగోలుకు ధరకు అగ్రిమెంట్ చేసుకోవాలి.

● నాకు ఐదెకరాల భూమి ఉంది. 12గేదెలు పెట్టుకుని పాడి ఆధారంగా జీవిస్తున్నా. ఆ భూమిలో మేత కూడా వేసుకుంటున్నా. రైతు భరోసామాత్రం ఇవ్వడంలేదు.

- గూడపాటి సత్యనారాయణం, మల్లారం, తల్లాడ మండలం

డీఏవో: మీరు ఖాళీ బీడు ఉంచితే రైతుభరోసారాదు. పంటలసాగుకోసమే రైతుభరోసా. ఏదైనా పంటవేసి వ్యవసాయశాఖ అధికారి ద్వారా క్రాప్ సర్వే చేయించి ధ్రువీకరించాలి. పాడిపరిశ్రమ మంచిదే అయినా ఇందుకు అవసరమైన మొక్కజొన్న, పెసర, జొన్న తదితర పశువుల మేతకో సమైనా పంటలు వేసుకుంటే రైతుభరోసా వస్తుంది.

● వరి, మిర్చి పంటలకు బ్యాంకు రుణాల స్కేల్‌ఆఫ్ ఫైనాన్స్ పెంచడం లేదు. దానివల్ల రుణాలు ఎక్కువగా ఇవ్వడంలేదు. అలాగే ధాన్యం కొనుగోలు సమయంలో కేంద్రాల్లోని ధాన్యం తడవకుండా పట్టాలుఇవ్వడంలేదు. అమ్మిన ధాన్యానికి సంబంధించి బోనస్ కూడా ఇంకా ఖాతాల్లోజమకాలేదు. నాకు రూ.70వేలు రావాల్సి ఉంది.

- రామడుగు ఆనందబాబు,పినపాక, తల్లాడ మండలం

డీఏవో: పంటలకు మద్దతు ధర, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఏపంటకు ఎంత బ్యాంకు రుణం ఇవ్వాలన్నది కేంద్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం బ్యాంకులు కూడా రుణాలు ఇస్తాయి. అయినా సమస్యను అటు బ్యాంకర్ల దృష్టికి, రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనరేట్‌కు తెలియ చేస్తాం. ప్రతీ కొనుగోలు కేంద్రం వద్ద సివిల్ సప్లయిస్ ఆధ్వర్యంలో ధాన్యం తడవకుండా పట్టాలు ఏర్పాటు చేశారు. అడిగిన రైతులకు ఇచ్చారు. రైతుభరోసా కింద పెట్టుబడి రైతులందరికీ అందించింది. ధాన్యం బోనస్ కూడా త్వరలోనే ఖాతాల్లో జమచేస్తుంది. ఆందోళన అవసరం లేదు.

మామిడితోటలో పూత, కాపు సమయంలో పండు ఈగ తీవ్రంగా నష్టం చేస్తుంది. ముందుజాగ్రత్తగా సస్యరక్షణ చర్యలున్నాయా

- శీలం వెంకటరామిరెడ్డి, నర్సింహాపురం, ఎర్రుపాలెం మండలం

డీఏవో: లింగాకర్షణ బుట్టలు పెట్టాలి. డిసెంబరు లనెలలో పూత ప్రాం రభం సమయంలో ఒకసారి రసంపీల్చే పురుగునివారణకు ఇమిడాక్లోప్రిడ్ మందు పిచికారీ చేయాలి. పూత ప్రారంభం తర్వాత మరో సారి చేయాలి.

● మాకు తొమ్మిదెకరాలు ఉంది. ఒక ఎకరానికి మాత్రమే రైతుభరోసా వచ్చింది. ఈసర్వేనెంబరులో రావులపాటి సీతారాములు, శ్రీనివాసరావు, కృష్ణమోహన్ పేరుతో 22ఎకరాలుండా ఎవరికీ రైతుభరోసా పడడంలేదు.

- రావులపాటి స్వరాజ్, ముదిగొండ

డీఏవో: దీనికి సంబంధించి మండల వ్యవసాయాధికారికి అన్ని ఆధారాలతో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయండి. కలెక్టరేట్‌లోని వ్యవసాయాధికారి కార్యాలయానికి వచ్చి వివరాలు అందిస్తే పరిశీలించి న్యాయం చేస్తాం. పంటసాగుచేస్తే తప్పనిసరిగా రైతుభరోసా పడుతుంది.

● రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పారు. అంతకంటే పైన ఉన్న రుణానికి సంబంధించి మొత్తం సొమ్ము బ్యాంకు చెల్లించాలి. కానీ బ్యాంకు రుణమాఫీ జరగలేదు. బ్యాంకుల వద్ద తిరిగి రుణం కూడా తీసుకోలేకపోతున్నాం. అలాగే పంట సాగుకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కూడా పెంచి ఎకరానికి రూ.లక్ష తగ్గకుండా రుణమివ్వాలి. సబ్సిడీపై విత్తనాలు అందించాలి

దొండపాటి రమేష్ కొణిజర్ల, తెలంగాణ రైతుసంఘం నాయకులు

డీఏవో: రూ2లక్షల లోపు రుణమాఫీ జరిగింది. పైన ఉన్న రుణాల విషయంలో ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. పంట సాగు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ కూడా కేంద్రమే నిర్ణయించాలి. అలాగే జిల్లాలో ఖరీఫ్‌లో సబ్సిడీపై సుమారు జీలుగులు, పిల్లిపెసర, జనుము తదితర పచ్చిరొట్ట ఎరువులకు సంబంధించి 14వేల క్వింటాళ్లు రైతులకు సబ్సిడీపై అందించాం.

సాగర్ కాలువ పక్కనే వెదజల్లే విధానంలో వరి వేస్తున్నాం. 20ఎకరాల వరకు సాగుచేస్తున్నాం. అయితే ఎరువులను ఒకేసారి తెచ్చుకోవడం సాధ్యంకావడంలేదు. మాగ్రామంలోనే ఎరువులు విక్రయిస్తే రైతులకు వెసులుబాటు ఉంటుంది.

వడ్డే వెంకటరామారావు, వెంగన్నపాలెం, తల్లాడ మండలం

డీఏవో: సొసైటీ ద్వారా సబ్‌సెంటర్ ఏర్పాటు చేయిస్తే ఎరువులు నేరుగా మీ గ్రామానికి పంపించే అవకాశం ఉంటుంది. లేదంటే రైతులే కమిటీలుగా ఏర్పడి బీఎస్సీ కెమిస్ట్రీ చదివిన వారుంటే వారి పేరిట లైసెన్సు తీసుకుంటే ఎరువులు నేరుగా తెచ్చుకునే అవకాశం ఉంటుంది.

● గ్రామంలో పాప్‌కార్న్ మొక్కజొన్నకు పలు కంపెనీలు పెట్టుబడులిచ్చి సాగుచేయిస్తున్నాయి. ఎక్కడా అగ్రిమెంట్లు ఇవ్వడంలేదు. దళారుల ప్రమేయం కూడా ఉంటుంది. ఇది చట్టబద్ధమేనా?

-పల్లపురెడ్డినాగిరెడ్డి, లక్ష్మీపురం, ఎర్రుపాలెం మండలం

డీఏవో: అనధికారికంగా ఏ కంపెనీ ఎలాంటి పంట వేసుకోమని చెప్పినా అది చట్టవ్యతిరేకమే. రైతులు కంపెనీల మాటలు చెప్పి మోసం పోకూడదు. ప్రతీ రైతు ఆయా కంపెనీలతో అగ్రిమెంట్ చేసుకుని పాప్‌కార్న్‌తో పాటు సీడ్ మొక్కజొన్న వేసుకోవాలి. బైబ్యాక్ అగ్రిమెంట్ ఉండాలి. లేదంటే నష్టం జరిగితే కంపెనీల చేతిలో మోసపోయే అవకాశం ఉంటుంది. ప్రభుత్వం కూడా అగ్రిమెంట్ లేకపోతే చర్యలు తీసుకోలేదు.

● పత్తిలో కలుపు నివారణకు ఎలాంటి మందులు పిచికారీ చేయాలి. పత్తివేసి 40రోజులవుతుంది. ఏజిల్ క్విక్‌కిడ్ కొట్టాం. కలుపు పోలేదు.

- అశోక్‌రెడ్డి ఎలుగోటి. ఆరికాయలపాడు, ఏన్కూరు మండలం

డీఏవో: పత్తిలో 30రోజులలోపే గడ్డిమందు పనిచేస్తుంది. గడ్డిముదిరితే పనిచేయదు. చేతితో తీయించాలి.

● మామిడితోటలో పూత, కాపు సమయంలో పండు ఈగ తీవ్రంగా నష్టం చేస్తుంది. ముందుజాగ్రత్తగా సస్యరక్షణ చర్యలున్నాయా

- శీలం వెంకటరామిరెడ్డి, నర్సింహాపురం, ఎర్రుపాలెం మండలం

డీఏవో: లింగాకర్షణ బుట్టలు పెట్టాలి. డిసెంబరులనెలలో పూత ప్రాం రభం సమయంలో ఒకసారి రసంపీల్చే పురుగునివారణకు ఇమిడాక్లోప్రిడ్ మందు పిచికారీ చేయాలి. పూత ప్రారంభం తర్వాత మరో సారి చేయాలి

● నాకు ఐదెకరాల భూమి ఉంది. సుబాబుల్ వేసుకోవాలంటే ఎంత దూరం పెట్టుకోవాలి?

- భారతి ఏపూరి, తాళ్లగూడెం, కామేపల్లి మండలం

డీఏవో: సుబాబుల్ వేసుకోవాలంటే 3 ఇంటు 2 దూరంలో గింజలు నాటాలి. అయితే మీ పొలంలో సుబాబుల్ కంటే పామాయిల్ సాగు చేస్తే మంచి లాభాలుంటాయి. ప్రభుత్వం కూడా సబ్సిడీ అధికంగా ఇస్తుంది. రైతులకు కావాల్సిన మొక్కలు డ్రిప్ ఇరిగేషన్, నాలుగేళ్లపాటు మిశ్రమ పంటలకు సాగుపెట్టుబడి, తిరిగి కొనుగోళ్లకు మార్కెట్ సదుపాయం ప్రభుత్వం ఇస్తుంది. ఏఈవోను సంప్రదించి సాగుకు సంబంధించిన విషయాలు తెలుసుకోండి. ఉద్యానశాఖ తరుపున అన్ని విధాల సహకారం అందిస్తాం.

● పత్తిలో సస్యరక్షణ లాంటి సమస్యలకు ప్రతీసారి అధికారులను సంప్రదించాల్సి వస్తుంది. అలాగే వాట్సాప్ గ్రూప్ రైతులతో ఏర్పాటుచేసి ఎప్పటికప్పుడు సీజన్‌వారీగా ఆయా పంటల సస్యరక్షణపై సమాచారమిచ్చే అవకాశం ఉందా?

-మేకపోతుల నాగేశ్వరరావు, లచ్చగూడెం, చింతకాని మండలం

డీఏవో: ఇప్పటికే ఏఈవోలు, ఏవోలకు మండల గ్రామస్థాయిలో రైతులతో వాట్సాప్‌గ్రూపులు ఏర్పాటుచేయాలని సూచించాం. ఈ గ్రూపుల్లో రోజువారీ సమాచారం రైతులకు అందిస్తాం. ప్రతీ గ్రామానికి ఈగ్రూపు ద్వారా సకాలంలో సలహాలు, సూచనలు అందిస్తాం.

● సుబాబుల్ తోటలో పత్తి వేశాం. కలుపు నివారణతో పాటు ఎలాంటి మందులు పిచికారీ చేయాలి. అలాగే సీతాఫలం తోటకు పూతకోసం ఏ మందు పిచికారీ చేయాలి

-నూతలపాటి సత్యనారాయణ, పింజరమడుగు, కామేపల్లి మండలం

డీఏవో: 30రోజుల్లోనే గడ్డిమందు పిచికారీ చేయాలి. దాటితే పనిచేయదు.

● ఎరువులు తేవాలంటే 18కిలోమీటర్లు వెళ్లాల్సి వస్తుంది. మా గ్రామంలోని సొసైటీ సబ్‌సెంటర్ ఏర్పాటుచేసి ఎరువులు విక్రయించండి. అందుకు అవసరమైన సదుపాయాలు కల్పిస్తాం.

-చిట్టూరి అచ్యుతరామయ్య, కొంగర, నేలకొండపల్లి మండలం

డీఏవో: మీ గ్రామంలో సబ్‌సెంటర్ ఏర్పాటుచేసి ఎరువులు అందుబాటులో ఉంచేలా చూస్తాం. సొసైటీ సీఈవోకు తెలియచేస్తాం.

> చింతకాని మండలంలో యూరియా బ్లాకులో అమ్ముతున్నారు. ప్రైవేటుగా దొరకడంలేదు.
>
> **- కన్నెబోయిన గోపి, బస్వాపురం, చింతకాని మండలం**
>
> డీఏవో: సొసైటీ సెంటర్లలో యూరియా విక్రయం జరుగుతుంది. ఎక్కడైనా సబ్‌సెంటర్ కావాలంటే సొసైటీల ద్వారా ఏర్పాటు చేయించి విక్రయిస్తాం. లేదంటే రైతులు గ్రూపులుగా ఏర్పడి లైసెన్సు తీసుకుంటే కూడా ఎరువులు నేరుగా పంపిస్తారు.

● ఎరువుల కొరత ఉంది. 5కిలోమీటర్లు వెళ్లి తేవాల్సివస్తోంది. సొసైటీ వారితో మాట్లాడి కొదుమూరులోనే ఎరువులు అమ్మే అవకాశం కల్పించండి.

- మేకపాటి నరేష్, కొదుమూరు, చింతకాని మండలం

డీఏవో: తప్పనిసరిగా సబ్‌సెంటర్ ఏర్పాటు చేయిచి ఎరువులు అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటాం. లేని పక్షంలో రైతులు గ్రూపుగా ఏర్పడి లైసెన్సు తీసుకుని ఎరువులు విక్రయించవచ్చు.

● నా భర్త సత్యనారాయణ, నాపేరు మీదు వేర్వేరుగా బ్యాంకులో రుణాలున్నాయి. రుణమాఫీజరగలేదు

-కొడవటి సుబ్బాయమ్మ, లక్ష్మీనగరం, దుమ్ముగూడెం మండలం

డీఏవో: మీ రుణం ఇద్దరి పేరుమీద వేర్వేరుగా రూ.2లక్షల కంటే ఎక్కువగా ఉన్నందున మాఫీ కాలేదు. ప్రభుత్వం రూ.2లక్షలు దాటిన వారికి మాఫీచేయాలని నిర్ణయిస్తే అప్పుడు అవుతుంది.

● మా అమ్మమ్మ దండా కమలమ్మ (90) అయితే ఆమె ఎరువుల కొందామని వెళితే వేలిముద్ర పడడంలేదు. ఓటీపీ రావడంలేదు. ఎరువులు ఎలా కొనాలి

-యలమద్ది లెనిన్‌బాబు రాజేశ్వరపురం, నేలకొండపల్లి మండలం

డీఏవో: మీ ఏవోను కలిసి సమస్య వివరించండి. కొంతమందికి వేలిముద్రల్లో మార్పులుజరిగి ఓటీపీ ఇబ్బందులు వస్తున్నాయి. సరిచేస్తారు.

● నేను 15 ఎకరాల్లో వెదజల్లేపద్దతిలో వరి వేశా. కలుపు మందు కొట్టినా పనిచేయడంలేదు. ఎకరానికి రూ.3వేలు ఖర్చు పెట్టినా ప్రయోజనం లేకుండా పోయింది. కంపెనీలకు ఫిర్యాదు చేస్తే రావడంలేదు.

- ఆపద వెంకటరామారావు, అన్నారుగూడెం, తల్లాడ మండలం

డీఏవో: ఏవోను పంపిస్తాం. అలాగే కంపెనీ అధికారులకు కూడా సమాచారమిస్తాం.

● మా గ్రామంలో క్రాప్ సర్వే చేయడం లేదు. పత్తి, ధాన్యం అమ్మేటప్పుడు ఇబ్బందులు వస్తున్నాయి. మీరు క్రాప్ సర్వే చేసి వివరాలు ఇస్తేనే పత్తి ధాన్యం అమ్మకాలకు సులభతరంగా ఉంటుంది.

యండపల్లి రవికుమార్, వల్లాపురం, ముదిగొండ మండలం

డీఏవో: ఏఈవో సెలవులో ఉన్నందున సర్వే జరగడం లేదు. వేరేవారిని పంపించి క్రాప్ సర్వేచేయిస్తాం.

● పెద్ద రైతులు ముందుగానే ఎరువులు కొనుగోలుచేసి స్టాకు పెట్టుకుంటున్నారు. చిన్న రైతులకు అందడంలేదు. అలాగే మానాన్న పేరుమీద ఉన్న తొమ్మిదెకరాలకు పీఎం కిసాన్ సొమ్ము రావడంలేదు

- కాటంనేని రామారావు, చంద్రుపట్ల, కల్లూరు మండలం

డీఏవో: ఎరువుల విషయంలో ఏనెలకు ఆ నెల సరిపోను రైతులు తీసుకోవాలి. ఇప్పటికే డీలర్లకు సాగు భూమి, వేసిన పంట అవసరం మేరకు రైతుకు ఎరువులు ఇవ్వాలని సూచించాం. ఎక్కువ కొనుగోలు చేసి తీసుకెళితే చర్యలు తీసుకుంటా.ం పీఎం కిసాన్‌వివరాలు ఏవోకు అందించండి.

మొర వినేదెవరు ?

(5వ పేజీ తరువాయి)

కోర్ కమిటీ సభ్యుడు పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఓ ప్రకటనలో ఖండించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా దేవుడి భూమిని కాపాడేందుకు ప్రయత్నించిన అధికారులపై దాడి చేయడం బాధాకరమని బీజేపీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు బైరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. ఈ భూములపై గతంలో ఏపీ హైకోర్టు భద్రాద్రి దేవస్థానానికి అనుకూలంగా తీర్పు ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. ఈవోపై దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.

ఆ అధికారి వ్యాఖ్యలపై దేవస్థాన వర్గాల విస్మయం

భద్రాద్రి రామయ్య భూముల్లో అక్రమ నిర్మాణాలను అడ్డుకునేందుకు వెళ్లేటప్పుడు దేవస్థానం అధికారులు తమకు ముందస్తు సమాచారం ఇవ్వలేదని ఏపీకి చెందిన ఓ పోలీసు ఉన్నతాధికారి


పురుషోత్తపట్నంలోని రామయ్య భూములు

చేసిన వ్యాఖ్యల పట్ల దేవస్థానం అధికార వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. గత ఏడేళ్లలో 60సార్లు యటపాక పోలీసులకు ఫిర్యాదు చేసినా కనీసం రశీదులు ఇవ్వలేదని రెవెన్యూ అధికారుల దృష్టికి తెచ్చినా వారు స్పందించలేదని వాపోతున్నారు. తాజాగా జరిగిన ఘటనకు ముందు తాము పోలీసులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశామని కానీ దానికి కూడా రశీదు ఇవ్వలేదని వారు తెలిపారు. తాము ఫోన్ చేసినా యటపాక పోలీసు అధికారులు స్పందించలేదని వారు ఆరోపిస్తున్నారు.

ఆలయాల భూములను పరిరక్షించాలి

(5వ పేజీ తరువాయి)

పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాదారులకు ఆయా గ్రామాల్లో ఉన్న రాజకీయ పార్టీల నాయకులు మద్దతు తెలుపుతూ అధికారులను బెదిరిస్తున్నారని ఆరోపించారు. గత ప్రభుత్వంలో ఉన్న నాయకులే ప్రస్తుత ప్రభుత్వంలోకి చేరి భూముల ఆక్రమణకు పాల్పడుతూ అధికారులను బెదిరిస్తున్నారని, ధైర్యం చేసి సర్వేలకు వెళితే అధికార పార్టీ నేతల మనుషులమంటూ, ఎలా ఉద్యోగం చేస్తారనో చూస్తామంటూ బెదిరిస్తున్నారని, దాంతో దేవాదాయ భూములను సర్వే చేసే పరిస్థితి లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల భూములు, ఉద్యోగుల రక్షణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని, లేదంటే ఇబ్బందులు తప్పవన్నారు. ఇదిలా ఉంటే ఎలాంటి ఇబ్బందులు లేని ఆలయ భూములను సర్వే చేసేందుకు.. నిధుల కొరత ఉందన్నారు. ఈవోపై జరిగిన దాడిని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తీవ్రంగా ఖండించి దాడికి పాల్పడిన వారిపై పీడీ యాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారని, కానీ దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు ఎవరూ స్పందించకపోవటం విచారకరమన్నారు. ఈ సమావేశంలో అర్చక జేఏసీ అధ్యక్షుడు దాములూరి. వీరభద్రంశర్మ, అర్చకులు రామశర్మ, కృష్ణమాచార్యులు, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు తోటకూరి. వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహణ అధికారులు జగన్‌మోహన్‌రావు, రామకోటేశ్వరరావు, శ్రీకాంత్, వేణుగోపాల చార్యులు, హరిచంద్ర శేఖర్, డీడీఎన్ఎస్ రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్ వర్మ, డీడీఎన్ అర్చకులు ఆమంచి. సురేష్‌శర్మ, మారిగంటి. భార్గవాచార్యులు, దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ ఎం. అనిల్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ కావూరి. ఆనంద్, ఆలయాల జూనియర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు. బుధవారం ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలోని ఆలయ ఉద్యోగులు, సిబ్బంది, అర్చకులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈవోపై దాడి జరిగినా ఉన్నతిధికారులు స్పందించకపోవటానికి కారణమేంటని ఉమ్మడి ఖమ్మం జిల్లా దేవాదాయ, ధర్మాదాయ అసిస్టెంట్ కమిషనర్ వీరస్వామిని వివరణ కోరగా అందరికంటే ముందుగానే స్పందించి ఈవోపై జరిగిన దాడిని ఖండించామని, దాడికి పాల్పడిన వారిపై కేసులు నమోదు చేసేందుకు చర్యలు తీసుకుంటూన్నామని తెలిపారు. దేవాదాయ శాఖ పరిధిలోని ఆలయ ఉద్యోగుల, అర్చకుల పై దాడి చేస్తే కఠిక చర్యలు తీసుకోకుంటామని తెలిపారు.

న్యాయాధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రాజగోపాల్

(5వ పేజీ తరువాయి)

ఉపసంహరణ గడువు బుధవారంతో ముగిసింది. అయితే ఉపసంహరణ గడువు ముగిసే సమయానికి అధ్యక్ష పదవికి రాజగోపాల్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక ఏకగ్రీవమైనట్టు ఎన్నికల అధికారి ప్రకటించారు రాజగోపాల్ ప్రస్తుతం ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తిగా పనిచేస్తున్నారు. అదేవిధంగా మహిళ ప్రతినిధిగా ఆర్థిక నేరాలు ప్రత్యేక న్యాయస్థానంలో న్యాయమూర్తిగా పనిచేస్తున్న జె.మైత్రి ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు ప్రకటించారు. ఇదిలా ఉంటే మిగిలిన పదవులకు షెడ్యూల్ ప్రకారం ఈనెల 19న ఎన్నికలు జరగనుండగా 27న ఎన్నికల ఓట్ల లెక్కింపు, తుది ఫలితాలు ప్రకటించనున్నారు. హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టు చీఫ్ జడ్జి శశిధర్ రెడ్డి ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్నారు. ఈ సంఘంలో మొత్తం 433 మంది న్యాయమూర్తులు తమ ఓటును వినియోగించుకోనుండగా.. అధ్యక్ష పదవితో పాటు మూడు ఉపాధ్యక్ష పదవులు, ఒక ప్రధాన కార్యదర్శి, ముగ్గురు సంయుక్త కార్యదర్శులు, 12మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకోనున్నారు. గతంలో ఓ సారి అధ్యక్షుడిగా పనిచేసిన రాజగోపాల్ మరోసారి ఎన్నికయ్యారు.

న్యాయమూర్తుల సమస్యల పరిష్కారానికి కృషి : రాజగోపాల్

రాష్ట్ర అధ్యక్ష పదవికి ఎన్నికైన న్యాయమూర్తి రాజగోపాల్ మాట్లాడుతూ తనకు రెండోసారి అధ్యక్ష పదవి రావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. న్యాయమూర్తుల సమస్యల పరిష్కారానికి వారి నివాస సముదాయాలు, నూతన కోర్టులు ఏర్పాటుకు, న్యాయమూర్తుల పోస్టుల భర్తీకి, వారి పదోన్నతల కోసం కృషి చేస్తానన్నారు.

సమ్మె సక్సెస్

(5వ పేజీ తరువాయి)

సీపీఐ ఆధ్వర్యంలో, నాయుడుపేట వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నేలకొండపల్లిలో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి, పీఏస్సార్ సెంటర్‌లో ధర్నా నిర్వహించారు. వైరాలో ర్యాలీ నిర్వహించి జాతీయ ప్రధాన రహదారులపై నిరసన తెలిపారు. వైరా ఐఎంఎల్ డిపోలో మద్యం సరఫరా నిలిచిపోయింది. ప్రభుత్వ, ప్రైవేట్ వాణిజ్య బ్యాంకులు మూతపడ్డాయి.

సత్తుపల్లి సింగరేణిలోని జేవీఆర్, కిష్టారం ఓసీలలో బీకేఎంయూ మినహా కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. కొణిజర్ల సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఏన్కూరు ప్రధాన సెంటర్‌లో అఖిలపక్షం ఆధ్వర్యంలో మానవహారం నిర్వహించి ర్యాలీ నిర్వహించారు. సత్తుపల్లిలో ఆర్టీసీ డిపో నుంచి బస్సులను అడ్డుకోగా సింగరేణిలోని జేవీఆర్, కిష్టారం ఓసీల్లో బీకేఎంయూ మినహా కార్మికులు స్వచ్ఛందంగా సమ్మెలో పాల్గొన్నారు. బోనకల్‌లో అఖిలపక్ష నాయకులు రాస్తారోకో నిర్వహించారు. మధిరలో అఖిల పక్షం ఆధ్వర్యంలో భారీ ప్రదర్శన నిర్వహించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ఆశవర్కర్లు, అంగన్‌వాడీలు, మిడ్డేమీల్స్ కార్మికులు, మునిసిపల్ వర్కర్లతోపాటు వివిధ రంగాలకు చెందిన కార్మికులు సమ్మె ప్రదర్శనలో పాల్గొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో...

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం ఓల్డ్ డిపో సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ అమరవీరుల స్థూపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గౌని నాగేశ్వరరావు మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం కార్మిక, కర్షకుల హక్కులను కాలరాస్తూ పాలన సాగిస్తోందన్నారు. కేంద్రం తీసుకుంటున్న నిర్ణయాలు, చట్టాలు అన్నివర్గాలకు గుదిబండగా మారుతున్నాయన్నారు. ఐదు దశాబ్దాల క్రితం పోరాటాలు, ప్రాణ త్యాగాలతో సాధించుకున్న 44కార్మిక చట్టాలను మోదీ ప్రభుత్వం యాజమాన్యాలకు, కార్పొరేట్లకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చి వేసిందన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా 200రోజులు పని కల్పించి రూ.600కూలీ చెల్లించాలని విపక్షాలు డిమాండ్ చేస్తుంటే కేంద్రం ఈ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు కుట్ర చేస్తోందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు కట్టబెడుతూ కార్మికులు, ఉద్యోగులకు ఉపాధి లేకుండా చేస్తోందన్నారు. ప్రజలకు చెందాల్సిన సహజ వనరులను పెట్టుబడిదారి వర్గాలకు కట్టబెడుతోందని విమర్శించారు. కేంద్రం తీసుకొచ్చిన జీవో-21తో లక్షలాదిమంది మోటారు కార్మికులు నష్టపోయే పరిస్థితులు ఉన్నాయన్నారు. ధరల భారంతో పేద, మధ్య తరగతి వర్గాలు సతమతమవుతుంటే కేంద్రానికి చీమకుట్టినట్లైనా లేదన్నారు. కేంద్రం తీరుకు నిరసనగా జరిగిన సమ్మె విజయవంతమైందన్నారు. ఈ సమ్మె కేంద్రానికి గుణపాఠం కానుందని స్పష్టం చేశారు. ఇల్లెందు సింగరేణి జేకే-5 ఓసీ, కోయగూడెం ఓసీల్లో కార్మికులు విధులకు గైర్హాజరయ్యారు. వీటితోపాటు జిల్లాలోని అన్నీ మండల కేంద్రాల్లోనూ అఖిలపక్షం ఆధ్వర్యంలో దర్నాలు నిర్వహించి నిరసనలు చేపట్టారు. ర్యాలీలు నిర్వహించారు.

విద్యుత్ సరఫరా.. మరింత మెరుగ్గా..

(5వ పేజీ తరువాయి)

అవసరమైన గుర్తించి.. 18ప్రాంతాల్లో కొత్త సబ్‌స్టేషన్లను మంజూరు చేశారు. ప్రస్తుతం వాటి నిర్మాణ పనులు కూడా ప్రారంభమయ్యాయి.


ఉపకేంద్రాలు నిర్మాణం జరిగే ప్రాంతాలు ఇలా..

ఖమ్మం నగరంలోని కబేళా ప్రాంతంలో, రఘునాథపాలెం మండలం కామంచికల్, ఏదులాపురంలోని తరుణిహాట్, వెంకటగిరిలో, రాజేశ్వరపురం సెక్షన్‌లోని అనంతనగర్‌లో బోనకల్ మండలంలోని లక్ష్మీపురం, బ్రహ్మణపల్లి, చిరునోములలో నిర్మించనున్నారు. అలాగే మధిర మండలంలోని రాయపట్నం, ఎర్రుపాలెం మండలంలోని రేమిడిచర్ల, తల్లాడ మండలంలోని అన్నారుగూడెం, పెద్దకోరుకొండి సర్కిల్ పరిధిలోని లింగాల గ్రామాల్లో నూతన విద్యుత్ ఉపకేంద్రాలను టీజీఎస్పీడీసీఎల్ మంజూరు చేసింది.

నగరంలో ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రం

ఖమ్మం నగరంలోని ప్రధానమైన వాణిజ్య ప్రాంతాల్లో విద్యుత్ డిమాండ్ గణనీయంగా పెరిగింది. అయితే ఆయా ప్రాంతాల్లో విద్యుత్ ఉపకేంద్రాలు నిర్మాణం చేసేందుకు కావాల్సిన స్థలాలు అందుబాటులో లేవు. దీంతో హైదరాబాద్ హైటెక్ సిటీలో నిర్మించిన విధంగా ఖమ్మం నగరంలోనూ ఇండోర్ విద్యుత్ ఉపకేంద్రాలకు ప్రతిపాదనలు పూర్తి చేశారు. ఈ మేరకు కలెక్టరేట్ నుంచి ఖమ్మం నగర పాలక సంస్థకు ఆదేశాలు అందాయి. బహిరంగ ప్రాంతంలో నిర్మించే విద్యుత్ ఉపకేంద్రానికి ఇండర్‌లో నిర్మాణం చేసే విద్యుత్ ఉపకేంద్రానికి మూడు రెట్లు ఆధిక వ్యయం అవుతుంది.

డిమాండ్ మేరకు విద్యుత్ ఉపకేంద్రాలు..


ఇనుగూరి శ్రీనివాసాచారి, పర్యవేక్షక ఇంజనీర్

జిల్లాలో డిమాండ్ మేరకు విద్యుత్ ఉపకేంద్రాలను నిర్మిస్తున్నాం. ప్రతీ నెల విద్యుత్ డిమాండ్ నివేదికలను ఉప ముఖ్యమంత్రి, ఇంధనశాఖ మంత్రి భట్టి విక్రమార్క దృష్టికి అందిస్తున్నాం. ఈ క్రమంలోనే జిల్లాలో ఒకే సారి 18విద్యుత్ ఉపకేంద్రాలు మంజూరయ్యాయి. వాటిలో కొన్ని ప్రారంభమయ్యాయి. ట్రాన్స్‌ఫార్మర్లపై 50శాతం లోడ్ పడగానే కొత్త విద్యుత్ ఉపకేంద్రాలకు కార్యాచరణ చేస్తున్నాం.

దంతెవాడలో 12మంది మావోయిస్టుల లొంగుబాటు

చర్ల, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఛత్తీసగఢ్ రాష్ట్రం దంతెవాడ జిల్లా పోలీసుల ఎదుట బుధవారం 12మంది మావోయిస్టులు లొంగిపోయారు. వీరిలో మావోయిస్టు పార్టీ వెస్ట్‌బస్తర్ కమిటీ సభ్యులు, మెడికల్‌టీం, ఏరియా కమిటీ, ఆర్‌పీసీ సభ్యులు ఉన్నారని దంతెవాడ ఎస్పీ గౌరవ్‌రాయ్ తెలిపారు. ఛత్తీస్‌గఢ్‌లో గతంలో మావోయిస్టులు జరిపిన పలు విధ్వంసకర ఘటనల్లో వీరంతా పాల్గొన్నారని ఎస్పీ పేర్కొన్నారు. 2020 నుంచి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం లాల్‌వర్రాట్ కార్యక్రమం చేపడుతోందని, అందులో భాగంగా గత ఐదు సంవత్సరాల్లో దంతెవాడ జిల్లాలో 1005 మంది మావోయిస్టులు లొంగిపోయారని, వీరిలో 813 మంది పురుషులు, 192 మంది మహిళలు ఉన్నారని ఎస్పీ తెలిపారు. అలాగే మావోయిస్టులు అడవుల్లో ఉండి సాధించేది ఏమీ లేదని, ఇతర మావోయిస్టులు కూడా లొంగిపోవాలని పోలీసులు సూచించారు.



నేడు వైరా ఆయకట్టుకు
నీటి విడుదల?

వైరా, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఈ ఖరీఫ్ సీజన్‌లో వైరా రిజర్వాయర్ ఆయకట్టులో నారుమళ్లు పోసుకొనేందుకు గురువారం నీరు విడుదల చేయనున్నారని విశ్వసనీయ వర్గాల సమాచారం. అధికారులు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయనప్పటికీ రైతుల నుంచి వస్తున్న ఒత్తిళ్ల మేరకు ఖరీఫ్‌లో నారుమళ్లు పోసుకోవడానికి నీరు విడుదల చేసేందుకు రంగం సిద్ధం చేసినట్లు సమాచారం. కుడి, ఎడ మకాల్వల హెడ్‌స్లూయిస్ నుంచి కొంతమేర లాకులు ఎత్తి నారుమళ్లకు నీరు విడుదల చేయనున్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టం 18.3అడుగులు కాగా ప్రస్తుతం 17అడుగులుగా నీటిమట్టం ఉంది. భారీ వర్షాలు కురిసి వరదనీరు వచ్చి చేరితే రిజర్వాయర్ పూర్తిస్థాయి నీటిమట్టాన్ని దాటి ప్రవహించే అవకాశాలను కూడా అధికారులు పరిగణలోకి తీసుకొని నారుమళ్లకు నీటి విడుదలపై స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌తో చర్చించి ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. ప్రస్తుతం కుడి, ఎడమకాల్వల్లో జరుగుతున్న రెండోదశ ఆధునీకరణ పనులను ఒకట్రెండు రోజుల్లో పూర్తిచేసి మిగిలిన పనులను ఖరీఫ్ సీజన్ తర్వాత చేయాలనే నిర్ణయానికి అధికారులు వచ్చారు. అలాగే ప్రస్తుతం అవసరం ఉన్నచోట్ల కాల్వల్లో పూడికతీత పనులు చేపట్టేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు.

నేడు గురుపౌర్ణమి

వేడుకలకు సిద్ధమైన సాయిబాబా ఆలయాలు



ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 9(ఆంధ్రజ్యోతి): మన సంస్కృతీ, సంప్రదాయాల్లో గురువుకు అగ్రతాంబూలం ఇచ్చారు. తల్లిదండ్రుల తరువాత గురువునే పూజిస్తారు. ఆ తరువాతే దేవుడిని కొలుస్తారు. సాక్షాత్తు పరబ్రహ్మతో సమానంగా గురువును గౌరవిస్తారు. గురువు లేనిదే జగత్తు లేదన్నది అక్షర సత్యం. అంతటి ప్రాధాన్యత ఉన్న గురువును కొలిచేందుకు ఓ శుభదినం కావాలి కదా అదే గురుపౌర్ణమి. దీనినే వ్యాసపౌర్ణమి అని అంటారు.

అష్టాదశ పురాణాలను భావితరాలకు అందించిన వాడు వ్యాసుడు. ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున వ్యాసమహర్షి జన్మించారు. అందుకే ఈ పౌర్ణమిని వ్యాసపౌర్ణమి అని కూడా అంటారు. బడుల్లో పాఠాలు చెప్పే వారిని మాత్రమే గురువుగా సంబోధించడం పరిపాటి. కానీ సిద్ధపురుషులను, కారణ జన్ములను, జీవిత సారాన్ని అందించిన వారిని కూడా గురువులుగా భావిస్తారు. అందుకు వ్యాస మహర్షి నిదర్శనం. సమాజానికి దిశానిర్దేశం చేసిన గురువులను స్మరించుకునేందుకు ఏటా ఆషాఢ శుద్ధ పౌర్ణమి రోజున గురుపూజా మహోత్సవాలు నిర్వహిస్తారు.

గురువే దైవంగా..

మన పురాణాల్లో ఎందరో ఆదర్శ గురువులున్నారు. రామలక్ష్మణులకు విశ్వామిత్రుడు, బలరామకృష్ణులకు సాందీపుడు, లవకుశులకు వాల్మీకి, అర్జునుడికి ద్రోణుడు ఆదర్శ గురువు లు. భక్తుల కష్టాలను కడతేర్చి కోరిన కోర్కెలను మాత్రమే తీర్చగల దేవుడికంటే శిష్యులకు విద్యాబుద్ధులు నేర్పించి ముక్తిమార్గాన్ని చూపే గురువుకే సముచిత స్థానం ఉంటుంది. హిందువులు దైవ స్వరూపుడిగా పూజించే దత్తాత్రేయుడు గురువులకు గురువు. షిర్డీ సాయిబాబా కూడా ఈ కోవలోకే చేరుతాడు.

అడుగడుగునా తన భక్తులకు అండగా నిలిచే ఆదర్శ గురువులైన సాయినాథుడు, దత్తాత్రేయుడికి గురుపౌర్ణమి సందర్భంగా ప్రణమిల్లడం, ఆ సద్గురువుల కృపకు పాత్రులు కావడం గురువులో దైవాన్ని చూడడం ప్రతి ఒక్కరికీ ముక్తిమార్గం. ఇంతటి పరమపవిత్రమైన గురుపౌర్ణమిన నాడు పరమగురువు ప్రజల ప్రాణాలను రక్షించి మోక్షమార్గాన్ని ప్రసాదించినవాడు షిర్డీసాయిబాబా.

ముస్తాబైన ఆలయాలు

గురుపౌర్ణమి మహోత్సవాన్ని పురస్కరించుకొని ఉమ్మడి జిల్లాలోని ఆలయాలు ముస్తాబయ్యాయి. ఖమ్మం నగరంలోని కవిరాజ్‌నగర్, ప్రశాంతినగర్, గాంధీచౌక్, రంగనాయకుల గుట్ట, మామిళ్లగుడెం, షిర్డీ సాయిబాబా మందిరాలను శోభాయమానంగా అలంకరించారు. గురువారం ఆలయంలో కాగడ హారతి, నందీశ్వర, దత్తాత్రేయ, షిర్డీ సాయినాథులకు పంచామృతాభిషేకం, చావిడి ఉత్సవం, అర్చన, అష్టోత్తర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం ధూప హారతి, సాయి భజన, పల్లకీసేవ, శేజా హారతి చేపట్టనున్నారు. ఉదయం 5 నుంచి రాత్రి 9 గంటల వరకు సాయిబాబా ఆలయాలలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రంగయనాకుల గుట్ట శ్రీకృష్ణ సాయి ఆశ్రమంలో గురుపౌర్ణమి సందర్భంగా ఉదయం విఘ్నేస్వామికి, శ్రీవల్లిదేవసేన సమిత సుబ్రహ్మణ్యస్వామికి అభిషేకాలు, 108 లీటర్ల గోక్షీరాభిషేకంతో ప్రత్యేక అభిషేకం, ప్రత్యేక పుష్పాలంకరణ, మధ్యాహ్నం మహాఅన్నదానం నిర్వహించనున్నారు.

బుల్లెట్‌పై ఆధ్యాత్మిక యాత్ర

- 10వేల కిలోమీటర్లు.. 30 రోజుల్లో పూర్తి...
- భారతయాత్ర - ఆధ్యాత్మిక యాత్ర పూర్తిచేసిన యువ పురోహితుడు
- బుల్లెట్‌పై ఉత్తర, దక్షిణ భారతాన్ని చుట్టిన ప్రవీణ్‌కుమార్‌శాస్త్రి


యాత్రలో ప్రవీణ్‌కుమార్ శాస్త్రి

సత్తుపల్లిరూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మిక బలం కోసం, యువతకు పుణ్యక్షేత్రాలపై అవగాహన పెంచడం, మన పూర్వీకుల గొప్పతనం తెలుసుకోవడంతో పాటు యువతకు తెలియజేయాలని సత్తుపల్లికి చెందిన ఓ యువకుడు నిర్ణయించుకున్నాడు. అనుకున్నదే తడవుగా స్నేహితులు కలిసి యాత్రకు శ్రీకారం చుట్టాడు. చివరి క్షణంలో స్నేహితులు రాకపోయినా ఓ బంధువుతో కలిసి తన యాత్రను కొనసాగించి విజయవతంగా పూర్తి చేసుకున్నాడు. అతనే సత్తుపల్లి మునిసిపాలిటీలోని ద్వారకాపూరి కాలనీకి చెందిన యువ పురోహితుడు ఉప్పల ప్రవీణ్‌కుమార్‌శాస్త్రి. అతనికి చిన్నప్పటి నుంచి బుల్లెట్ అంటే చాలా ఇష్టం. ఎటువెళ్లిన ఈ బుల్లెట్‌పైనే తన ప్రయాణం కొనసాగించేవారు. ఈ క్రమంలో ఆధ్యాత్మికయాత్ర చేపట్టాలనే ఆలోచనకు వచ్చిన ప్రవీణ్‌కుమార్ తన బుల్లెట్ బండిపై యాత్రకు కావాల్సిన అన్ని వసతి, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేసుకున్నారు.

స్నేహితులు కలిసి రాకున్నా..

ఆధ్యాత్మికయాత్రకు ప్రవీణ్‌కుమార్‌శాస్త్రితో వెళ్లేందుకు స్నేహితులు నిరాకరించారు. నిరాశకు లోనవ్వకుండా సమీప బంధువు శరత్‌కుమార్‌వర్మతో కలిసి రెండు బుల్లెట్ బండ్లపై హైదరాబాద్‌లో తన ప్రయాణాన్ని ప్రారంభించారు. నెల రోజుల వ్యవధిలోనే ప్రయాణాన్ని కొనసాగించి విజయవంతంగా పూర్తి చేశారు. దక్షిణ, ఉత్తర భారతంలోని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ, మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, హర్యానా, హరిద్వార్, ఉత్తరప్రదేశ్, బీహార్, జార్ఖండ్, ఒరిస్సా రాష్ట్రాల మీదుగా ఆంధ్రాలోని శ్రీకాకుళం మీదుగా తెలంగాణ రాష్ట్రంలోని ప్రవేశించిన ప్రవీణ్‌కుమార్‌శాస్త్రి తన స్వస్థలాన్ని 30రోజుల్లోనే చేరుకున్నారు. తన ఆధ్యాత్మిక యాత్రలో చార్‌ధామ్‌తో పాటు అన్ని ముఖ్యక్షేత్రాలను సందర్శించానని ప్రవీణ్‌కుమార్ శాస్త్రి తెలిపారు. పట్టణానికి చెందిన సృజనసాహితీ సమాఖ్య బాధ్యులు రామకృష్ణ, మధుసూదనరాజు, నాగేశ్వరరావు, నరసింహారావు, శ్రీనివాసరావు, వీరస్వామిలు ప్రవీణ్‌కుమార్‌శాస్త్రిని ఘనంగా సన్మానించారు.

ఎమ్మెల్యే ఆదేశించినా పట్టించుకోరా..?

ఆర్‌అండ్‌బీ అధికారులపై అన్నపురెడ్డిపల్లి వాసుల ఆగ్రహం


నడి రోడ్డుపై పడిన గుంత.. ప్రమాదాలు జరగకుండా సూచికగా వస్త్రాలు పెట్టిన దృశ్యం

అన్నపురెడ్డిపల్లి, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే జారె ఆదినారాయణ మాటంటే ఆర్‌అండ్‌బీ అధికారులకు లెక్కలేనట్లు ఉంది. ఇప్పుడే కాదు గతంలోను పలు మార్లు ఎమ్మెల్యే ఆదేశాలు పెడచెవిన పెట్టిన దాఖలాలు ఉన్నాయి. మరో సారి అన్నపురెడ్డిపల్లిలో ఇది రుజువయింది. నిత్యం ప్రజలలతో పాటు వందలాధి భక్తులు ప్రయాణించే శ్రీబాలాజీ ఆలయం రహదారిలో ఇటీవల మూడు, నాలుగు అడుగులు లోతున గుంతలు ఏర్పడ్డాయి. ఈ విషయం స్థానికులు అధికారులకు సమాచారం ఇచ్చారు అయినా ఫలితం లేదు కాగా సోమవారం ఎమ్మెల్యే జారె తన పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొనేందకు అన్నపురెడ్డిపల్లి వచ్చారు. ఈ సమయంలో కొందరు గుంతల విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. ఎమ్మెల్యే స్వయంగా గుంతులు పడిన ప్రదేశాన్ని పరిశీలించి తక్షణమే గుంతలు పూడ్చి మరమ్మతులు చేయాలని ఫోన్‌లో ఆర్‌అండ్‌బీ అధికారులను ఆదేశించారు. అయినా అధికారులు ఎవరు కన్నెత్తి చూడలేదు. ప్రమాదంగా ఉన్న గుంతలను పూడ్చాలని ఎమ్మెల్యే ఇచ్చిన ఆదేశాలను అధికారులు లెక్కచేయక పోవటంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నైపుణ్య శిక్షణ కోసం.. ఎంబీసీ నిరుద్యోగ అభ్యర్థులు
దరఖాస్తు చేసుకోవాలి

చుంచుపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నైపుణ్య శిక్షణ కోసం ఎంబీసీ నిరుద్యోగ అభ్యర్థులు ఈ నెల 12వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని భద్రాద్రి జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారిని ఇందిరా బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర అత్యంత వెనుకబడిన తరగతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణ సమయంలో అభ్యర్థులకు రవాణా సౌకర్యాలు, భోజన, వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థుల వయస్సు 21 నుంచి 30 సంవత్సరాల వరకు డిగ్రీ ఉత్తీర్ణులైన వారు, తమ ఆధార్‌కార్డు కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో అధికారిక వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, అనంతరం ఆన్‌లైన్ పత్రాలను 14వ తేదీలోపు భద్రాద్రి ఐడీవోసీలోని ఎస్-27లో బీసీ అభివృద్ధి అధికారి కార్యాలయంలో అందజేయాలన్నారు.

14న నవోదయ విద్యాలయం ప్రారంభం: డీఈవో

కరకగూడెం జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాల వద్ద తాత్కాలికంగా ఏర్పాటు చేయనున్న జవహర్ నవోదయ విద్యాలయాన్ని 14న ప్రారంభిస్తున్నట్లు బుధవారం డీఈవో ఎం వెంకటేశ్వరచారి తెలిపారు. జిల్లా సెక్టోరియల్ అధికారులు నాగరాజు శేఖర్, సైదులతో కలిసి ఆయన ఆ ఏర్పాట్లను పరిశీలించారు. వేరువేరు ప్రదేశాల నుంచి విద్యార్థులకు ప్రవేశం కల్పిస్తున్నామన్నారు. అత్యంత నాణ్యమైన విద్యను భద్రాద్రి జిల్లా విద్యార్థులకు అందుబాటులోకి రావడం అదృష్టమన్నారు.

చర్చి స్థలాన్ని అధికారులు కాపాడాలి

ఆక్రమిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న క్రీస్తుసంఘ బాధ్యులు, మాజీ కౌన్సిలర్

సత్తుపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్‌లో ఆరు కుంటల క్రీస్తుసంఘం చర్చీ స్థలాన్ని ఆక్రమించుకుని స్థానికుడైన అలవాల కరుణాకర్ అనే వ్యక్తి ఇందిరమ్మ ఇల్లు కట్టుకునే ప్రయత్నం చేస్తున్నాడని, క్రీస్తు సంఘం సభ్యుడు నడ్డి ఆనందరావు, మాజీ కౌన్సిలర్ చాంద్ పాషా, కో-ఆప్షన్ మాజీ సభ్యుడు తడికమళ్ల ప్రకాశరావు, కొత్తూరు మాజీ ఉప సర్పంచ్ పెద్దిరెడ్డి పురుషోత్తం ఆరోపించారు. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులకు కూడా ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. బుధవారం ఎన్టీఆర్ నగర్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గతంలో కోటగిరి మురళీ కృష్ణారావు సర్పంచ్‌గా ఉన్న కాలంలో 3 కుంటల స్థలం, 20ఏళ్ల క్రితం మంత్రిగా ఉన్నప్పుడు తుమ్మల నాగేశ్వరరావు మరో 3 కుంటల స్థలాన్ని క్రైస్తవుల కోసం కేటాయించారని గుర్తుచేశారు. అందులో కొంతభాగం చర్చి నిర్మించి ఖాళీగా ఉన్న స్థలాన్ని క్రైస్తవులు శుభకార్యాలకు వాడుకుంటున్నారని, కానీ సంఘంలో ఫాస్టర్‌గా ఉన్న కరుణాకర్ ఆ స్థలంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయించుకుని నిర్మాణానికి ప్రయత్నిస్తున్నాడని ఆరోపించారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మించాలంటే ప్రభుత్వం ఇచ్చిన పట్టా ఉండాలని, అది లేకుండా ఎలా మంజూరు చేస్తారని ప్రశ్నించారు. ఏ హక్కూ లేకుండా చర్చి స్థలంలో చేపడుతున్న నిర్మాణాన్ని అడ్డుకోవాలని అధికారులను కోరారు. కలెక్టర్, ఆర్డీవో, సత్తుపల్లి తహసీల్దార్, మునిసిపల్ కమిషనర్‌లకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. అదేవిధంగా సత్తుపల్లి విరాట్ నగర్‌లో గత టీడీపీ హయాంలో 5ఎకరాల స్థలాన్ని క్రైస్తవ శ్మశానం కోసం కేటాయించగా.. అందులో అంతిమ సంస్కారాలకు పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారని అధికారులకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. క్రీస్తుసంఘం సభ్యులు ఇచ్చిన ఫిర్యాదుతో అలవాల కరుణాకర్‌కు నోటీసులు జారీచేశామని సత్తుపల్లి మునిసిపల్ కమిషనర్ కె.నర్సింహా తెలిపారు. అతడి నుంచి వచ్చిన సమాధానాన్ని బట్టి తదుపరి విచారణ ఉంటుందన్నారు.

గంజాయి రవాణా.. ముగ్గురు యువకుల అరెస్ట్

- 822 గ్రాముల గంజాయి, రెండు ద్విచక్రవాహనాలు, సెల్ ఫోన్లు సీజ్
- వివరాలు వెల్లడించిన ఏసీపీ రఘు


వివరాలు వెల్లడిస్తున్న కల్లూరు ఏసీపీ రఘు

కల్లూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి): కల్లూరు పట్టణంలోని లక్ష్మీపురం రహదారి వైపున గంజాయి రవాణ పాల్పడుతున్న ముగ్గురు యువకులను అదుపులోకి తీసుకోని బుధవారం అరెస్ట్ చేసినట్లు కల్లూరు ఏసీపీ రఘు తెలిపారు. ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ వివరించారు. కల్లూరులో మంగళవారం స్థానిక ఎస్ఐ హరిత తన సిబ్బందితో పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో లక్ష్మీపురం రహదారి వైపున పీఏసీఎస్ కార్యాలయం వెనుక చెరువు కట్ట వద్ద ముగ్గురు యవకులు అనుమానస్పదంగా ఉండగా, పోలీస్‌వాహన సైరన్ విని రెండు ద్విచక్రవాహనాల మీదగా పారిపోతుండగా పోలీసులు వెంబడించి పట్టుకోని అదుపులోకి తీసుకోన్నట్లు వివరించారు. వారిలో కల్లూరుకు చెందిన ఎస్‌కె హమీద్. మణుగూరుకు చెందిన ఎస్‌కె హబీబ్ పాషా, మిడియం గోవింద్ ఉన్నారని చెప్పారు. ఈ ముగ్గురు యువకులు గంజాయి తాగడానికి అలవాటు అయ్యారని, ఒడిసా రాష్ట్రం మల్కాన్ గిరి జిల్లాకు వెళ్లి అక్కడ సన్నీ అనే వ్యక్తి వద్ద ఒక కేజి గంజాయి రూ. 3,500 కొనుగోలుచేసి పంచుకొని, కొంతమొత్తం వారు తాగడానికి ఉంచుకొని సేవిస్తూ, మిగిలిన దాన్ని అమ్మేవారిని ఏసీపీ తెలిపారు.

కల్లూరుకు చెందిన హమీద్ స్నేహితులు గంజాయి త్రాగే అలవాటు ఉన్న యువకులు ఎంతైన డబ్బు పెట్టి గంజాయిని పెద్ద మొత్తంలో తెచ్చి అమ్మితే మంచి లాభాలు వస్తాయి అని గ్రహించారు. 10 రోజుల క్రితం హమీద్, హబీబ్, మిడియం గోవిందులు రెండు మోటారు సైకిల్స్‌పై ఒడిషా రాష్ట్రం మల్కాన్‌గిరి జిల్లా కేందుగూడ వెళ్లి సన్నీ వద్ద నుంచి సుమారు నాలుగు కిలోల గంజాయి తెచ్చారన్నారు. వారిలో హమీద్ రెండు కిలులో గంజాయి తీసుకోగా, మిగిలిన ఇద్దరు చెరోక కిలో పాకెట్ తీసుకున్నారు. హమీద్ వాటాగా వచ్చిన దానిని అతడి వద్ద తరుచుగా గంజాయి తీసుకోవెళ్లే గడ్డం ప్రశాంత్ (వీఎం బంజర), శివ, రామకృష్ణ (టేకులపల్లి), బ్రహ్మతేజ (వీఎం బంజర), శ్రీకాంత్ (గంగాదేవిపాడు), హరి (వీఎం బంజర), డి సాయి (విఎంబంజర), గుండ్ల శివ, బొడ్డు చందు (గోపాలకుంట, కల్లూరు), ఉబ్బన సుభాష్ (కల్లూరు), విష్ణు, కార్తీక్, హరి (తల్లాడ), వంగల మణికంఠ (పుల్లయ్యబంజరు), రఘు (అంజనాపురం), చింటూ, గోపి (వేంసురు), బేతి నిఖిల్ (కల్లూరు), ఆసిఫ్ (కల్లూరు), లకు రూ.300 కు ఒక ప్యాకెట్ చొప్పున అమ్మినారని ఆయన చెప్పారు. ఇంకా హమీద్ వద్ద కొంత గంజాయి మాత్రమే ఉంది. ఇక్కడ డిమాండు ఎక్కువగా ఉండటంతో హమీద్ ఈ విషయాన్ని హబీబ్, గోవిందులకు తెలపగా వారు తమ ఇద్దరి వద్ద కలిపి ఇంకా అర కిలో పైనే గంజాయి ఉందని చెప్పగా, దానిని కల్లూరుకు తేస్తే ఇక్కడ వెంటనే అమ్మి వచ్చిన డబ్బులతో మరల ఒడిషా వెళ్లి కొనుక్కో వస్తానని చెప్పనట్లు వివరించారు. అందుకు ఒప్పుకొని ఇరువురు వారి వద్ద మిగిలి ఉన్న గంజాయిని తీసుకోని మోటారు సైకిల్‌పై బుధవారం కల్లూరుకు రాగా, హమీద్ బండి మీద కల్లూరు పట్టణ శివారున లక్ష్మీపురం రోడ్డు వైపున గల చెరువు కట్ట వద్దకు వచ్చి కలిసి వారి వద్ద నుంచి గంజాయి తీసుకుందామనే లోగా పోలీసులు దాడి చేసి పట్టుకున్నట్లు ఏసీపీ రఘు విలేకరులకు వివరించారు. వారి వద్ద నుంచి 822 గ్రాముల గంజాయిని విలువ రూ.24,600, రెండు ద్విచక్రవాహనాలను, మూడు మొబైల్ ఫోన్లను సీజ్ చేసినట్లు చెప్పారు. ఇలా గంజాయి అమ్మిన (కన్జుమర్స్) కోసం సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తలింగయ్యగౌడ్ ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చెపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఈ కేసును ఛేదించిన ఎస్ఐ హరిత, సిబ్బందిలను ఏసిపి రఘు అభినందించారు.సమావేశంలో సతుపల్లి రూరల్ సీఐ ముత్తులింగయ్యగౌడ్, కల్లూరు ఎస్ఐ డిహరిత, సిబ్బందిలు పాల్గొన్నారు.

అతర్‌జిల్లా దొంగల అరెస్టు

- పరారీలో మరో ఇద్దరు
- 30తులాల బంగారం, కేజీ వెండి ఆభరణాలను స్వాధీనం
- వివరాలను వెల్లడించిన డీఎస్పీ


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రహమాన్

సుజాతనగర్, జూలై 9(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని వివిధ ప్రాంతాలలో వరుస చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగలను సుజాతనగర్‌లో వాహన తనిఖీలలో పట్టుకుని ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు కొత్తగూడెం డీఎస్పీ అబ్దుల్ రెహమాన్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో వివరాలను వెల్లడించారు. భద్రాచలం సీతారాంనగర్ కాలనీకి చెందిన షేక్‌ధారుక్ బాబా (అలియాస్ చోటు), వల్లే విజయరావు బూర్గంపాడు మండలం నాగినేనిప్రోలుకు చెందిన నలమటి సాయిరామ్, మోతేకి చెందిన అఖిల్, మణుగూరుకు చెందిన సూర్యప్రకాశరావు ఐదుగురు కలసి గతకొంత కాలం గా ఒక ముఠాగా ఏర్పడి ఇళ్ల తాళాలు పగలగొట్టి బంగారు అభరణాలు చోరీ చేశారు. వీరి లక్ష్మీదేవిపల్లి, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, చర్ల, భద్రాచలం తదితర ప్రాంతాలలో చోరీలకు పాల్పడ్డారు. దీంతో సుజాతనగర్‌లో నిర్వహించిన వాహన తనిఖీలలో వారు పట్టుపడ్డారు. వారి వద్ద నుంచి రూ. 30లక్షలు విలువ చేసే 30తులాల బంగారం, కేజీ వెండి ఆభరణాలు. ద్విచక్ర వాహనం మొబైల్ ఫోను, చోరీకి ఉపయోగించే ఇనుపరాడ్లు, రెండు స్క్రూడ్రైవర్లను స్వాధీనం చేసుకున్నారు. షేక్ దారుక్ బాబా, నల్లపాటి సాయిరాం, వల్లె విజయరావులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అఖిల్, సూర్యప్రకాశరావు పరారీలో ఉన్నారని, త్వరలోనే వారిని కూడా అరెస్ట్ చేస్తామని తెలిపారు. సీసీఎస్ సీఐ రమాకాంత్, ఎస్ఐ ప్రవీణ్‌రామారవు, క్లూస్ టీం సీఐ అశోక్‌కుమార్, చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లను ఎస్పీ రోహిత్‌రాజు అభినందించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో సీసీఎస్ సీఐ రమాకాంత్, చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, ఎస్ఐ రమాదేవి పాల్గొన్నారు.

కుమారుడు అమెరికా చేరక ముందే..
గుండెపోటుతో తండ్రి మృతి


శ్రీనివాసరావు (ఫైల్)

చింతకాని, జూలై 9 (ఆంధ్రజ్యోతి): గుండెపోటుతో ఆర్టీసీ ఉద్యోగి రామ్‌శెట్టి శ్రీనివాసరావు (58) బుధవారం మృతిచెందారు. ఖమ్మం నగరంలోని ఆర్టీసీ కాలనీలో నివాసం ఉంటున్న శ్రీనివాసరావు మధిర టీఎస్ ఆర్టీసీ డిపోలో ఏడీసీగా పని చేస్తున్నాడు. బుధవారం విధులకు హాజరయ్యేందుకు ఖమ్మం నుంచి ప్యాసింజర్ రైలులో మధిర వెళ్తుండగా చాతిలో నొప్పి రావడంతో చింతకాని రైల్వే స్టేషన్‌లో దిగి ఆరోగ్య పరీక్షల నిమిత్తం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లగా గుండెపోటు రావడంతో ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. అక్కడే ఉన్న వైద్యాధికారి అల్తాఫ్ సీపీఆర్ చేసిన ఫలితం లేకుండా పోయింది. పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఖమ్మం తరలించారు. మృతుడు శ్రీనివాసరావు కుమారుడు రామ్ చరణ్‌ను అమెరికాలో ఎంఎస్ చదివించేందుకు మంగళవారం హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో విమానం ఎక్కించాడు. కుమారుడు ఇంకా అమెరికాలో కాలు మోపక ముందే శ్రీనివాసరావు గుండెపోటుతో మృతిచెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

చికిత్స పొందుతూ మృతి

బూర్గంపాడు, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువులు చదువుకోవడం ఇష్టంలేక ఓ యువకుడు ఆత్మహత్యయత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ విషాద ఘటన బుధవారం సండెళ్లరామాపురం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం...బూర్గంపాడు మండల పరిధిలోని సండెళ్లరామాపురం గ్రామానికి చెందిన కారం సందీప్ (16) గత మార్చిలో పదో తరగతి పూర్తి చేశాడు. కుటుంబసభ్యులు పై చదువులు చదువుకోవాలని సూచించారు. చదువుకోవడం ఇష్టం లేక గత నెల 26న ఇంట్లో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు యువకుడిని భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడి తల్లి వెంకమ్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు ఆత్మహత్య

- వరకట్న వేధింపులతో వివాహిత, మానసిక సమస్యలతో ఉద్యోగి బలవన్మరణం

దమ్మపేట, జూలై 9(ఆంధ్రజ్యోతి): వరకట్న వేదింపులు తాళలేక వివాహిత ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గండుగులపల్లి గ్రామంలో బుధవారం జరిగింది. ఈఘటనకు సంబంధించి దమ్మపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఏపీలోని ఏలూరి జిల్లా, చింతలపూడి మండలం కొమ్ముగూడెం గ్రామానికి చెందిన కుంటా రూప(19)కు దమ్మపేట మండలం గండుగులపల్లి గ్రామానికి చెందిన ఏడుకొండలతో కొద్ది కాలం క్రితం వివాహ మైంది. బార్యను అదనపు కట్నం కోసం వేదిస్తుండటంతో పాటు మానసికంగా, శారీకంగా హింసించటంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో దుప్పటితో రూప ఇనుప రాడ్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి యతిరాజు వీరకుమారి దమ్మపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్ఐ సాయికిషోర్‌రెడ్డి కేసు విచారణ చేస్తున్నారు.

రైలు కిందపడి మునిసిపల్ ఉద్యోగి

మధిరటౌన్ (ఆంధ్రజ్యోతి): రైలు కిందపడి మధిర మునిసిపాలిటీలో బిల్ కలెక్టర్‌గా ఉద్యోగం చేస్తున్న తాండ్ర అనిల్ (36) బుధవారం ఉదయం ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం డోర్నకల్ నుంచి విజయవాడ వైపు వెళుతున్న గూడ్స్ రైలు కిందపడి మధిర రైల్వే స్టేషన్ సమీపంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు కొంతకాలంగా మానసిక సమస్యలతో బాధపడుతున్నా డు. విజయవాడలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో మా నసిక వైద్యుడి దగ్గర చికిత్స పొందుతున్నాడు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నాడు. మానసిక సమస్యలతోనే ఆత్మహత్యకు పాల్పడినట్లు కుటుంబసభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేసారు, మృతదేహన్ని రైల్వే పోలీసులు శవపరీక్ష కోసం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి రైల్వే హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రేగులగండి చెరువులో సింగరేణి కార్మికుడి గల్లంతు

మణుగూరు, జూలై 9 (ఆంధ్రజ్యోతి) : మణుగూరులో గల రేగులగండి చెరువులో మునిగి ఓ సింగరేణి కార్మికుడు గల్లంతు అయిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న సింగరేణి రెస్క్యూటీమ్, అగ్నిమాపక అధికారులు చెరువులో గాలింపు చర్యలు చేపట్టారు. వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల బెల్లంపల్లి ఏరియాల నుంచి బదిలీ పై వచ్చిన ఇపీ ఆపరేటర్లు మిత్రులు ఐదుగురు మణుగూరులోని రేగులగండి ప్రాంతంలో బుధవారం పార్టీ చే సుకున్నారు. ఈ క్రమంలో ఐదుగురు మిత్రులు రే గులగండి చెరువులో ఈతకు దిగారు.

ఈ నేపథ్యంలో మణుగూరు ఏరియాలోని ఓసీ-2 గనిలో ఈపీ ఆపరేటర్‌గా పనిచేస్తే సుంకరి శ్రీనివాస్(37) అనే ఈపీ ఆపరేటర్ మునిగిపోయాడు. దీంతో ప్రమాదాన్ని గమనించిన మిత్రులు వెంటనే చెరువు నుంచి బయటికి వచ్చేశారు. విషయాన్ని తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది గాలింపు చర్యలను చేపట్టారు.

పాత పూసపల్లిలో ఎవరినీ
కుల బహిష్కరణ చేయలేదు

- గ్రామ పెద్దల వెల్లడి
- రాజకీయ కక్షతోనే తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆరోపణ


మాట్లాడుతున్న పాత పూసపల్లి గ్రామస్థులు

ఇల్లెందురూరల్, జూలై9(ఆంధ్రజ్యోతి): పాత పూసపల్లి గ్రామంలో ఎవరిని కుల బహిష్కరణ చేయలేదని గ్రామ పెద్దలు వర్స అవినాష్, పుల్లయ్య సూర్నపాక వెంకట నారాయణ, తెల్లం శ్యాం, కుంజ వీరాస్వామి తెలిపారు. బుధవారం గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ పాతపూసపల్లి గ్రామానికి సంబందంలేని ముడిగ కృష్ణకుమారి, రాములు, లక్ష్మీనర్సు, విజయ్, సత్యనారాయణలతో కలిసి సీపీఎం నాయకులు తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని ఆరోపించారు. మా ప్రక్క గ్రామమైన కొత్తపూసపల్లికి చెందిన కుటుంబంతో కలిసి రాజకీయ కక్ష్య సాదింపులో బాగంగా పాతపూసపల్లి గ్రామంపై తప్పుడు ప్రకటనలు చేయడం తగదని హెచ్చారించారు. రెండు గిరిజన గ్రామాల మధ్య సీపీఎం నాయకులు చిచ్చు పెట్టాలని చూడడం తగదని హెచ్చారించారు. ఏవైనా భూసమస్యలు ఉంటే గ్రామంలో ఉన్న గ్రామ, కుల పెద్దలను తెలుసుకొని పెపర్ ప్రకటనలు చేస్తే బాగుండేదని, గ్రామానికి సంబందంలేని వ్యక్తులతో కలిసి మాగ్రామంపై బురదచల్లే కార్యక్రమాలకు తెర తీయవద్దని వారు హెచ్చారించారు.

గంజాయి తాగుతున్న యువకుడి అరెస్ట్

చింతకాని, జూలై 9(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రామకృష్ణాపురం క్రాస్‌రోడ్డు సమీపంలో గంజాయి సేవిస్తున్న ఖమ్మం ప్రకాశ్‌నగర్‌కు చెందిన బీ వంశీని పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. అతని వద్ద సిగరెట్ రూపంలో ఉన్న గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



తిరుమలాయపాలెంలో...



ఖమ్మంలో..



నేలకొండపల్లిలో...



ఖమ్మంరూరల్‌లో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు

సార్వత్రిక సమ్మె విజయవంతం



ఖమ్మంలో ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 9(ఆంధ్రజ్యోతి): దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె కార్యక్రమంతో ఖమ్మం నగరంలోని ప్రధాన రహదారులు ఎరుపెక్కాయి. కమ్యూనిస్టులు పూర్వ వైభవం దిశగా అడుగులు పడుతున్నాయా అనే చర్చ నగర ప్రజల మదిలో మెదిలింది. సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్‌రావు, సీపీఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ రాష్ట్ర నాయకులు గోకినపల్లి వెంకటేశ్వరరావుతో పాటుగా కాంగ్రెస్, బీఆర్‌ఎస్ శ్రేణులు సార్వత్రిక సమ్మెలో పాల్గొన్నాయి. కాగా జడ్పీసెంటర్ నుంచి పెవిలియన్ మైదాన వరకు చేపట్టిన ర్యాలీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్పొరేటర్ బీజీ క్లైమెంట్, బీజేపీయేతర కార్మిక సంఘాల నాయకు లు వై విక్రమ్, విష్ణు, కళ్యాణం వెంకటేశ్వరరావు, జీ రా మయ్య, కే శ్రీనివాసరావు, ఎం. లక్ష్మీనారాయణ, కొత్తా సీతారాములు, మలీదు నాగేశ్వరరావు, శోభ, దండి సురేశ్, సిం గు నర్సింహారావు, తోట రామాంజనేయులు పాల్గొన్నారు.

నేలకొండపల్లి, జూలై9(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా బుధవారం బీజేపీయేతర కార్మిక సంఘాలు నిర్వహించిన దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా నేలకొండపల్లిలో కార్మిక సంఘాలు నిర్వహించిన సమ్మె పూర్తిగా విజయవంతమైంది. కార్యక్రమంలో కొప్పుల వెంకట్రామిరెడ్డి, మారిశెట్టి వెంకటేశ్వరరావు, పగిడికత్తుల నాగేశ్వరరావు, గుడవర్తి నాగేశ్వరరావు, కాశిబోయిన అయోధ్య, ఏటుకూరి రామారావు, పగిడికత్తుల రామదాసు, జ్యోతి, భాస్కరరావు, కాసాని నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు.

ఖమ్మం రూరల్, జూలై 9(ఆంధ్రజ్యోతి): ఖమ్మం రూరల్ మండలం, ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో బుధవారం నిర్వహించిన సార్వత్రిక సమ్మె విజయవంతం అయింది. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి దండి సురేష్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర నాయకుడు మిడకంటి వెంకటరెడ్డి, సుదర్శన్ రెడ్డి, ఉన్నం రంగారావు, మండల కార్యదర్శి పుచ్చకాయల సుధాకర్, భాస్కర్, సురేందర్, శంకరయ్య పాల్గొన్నారు.

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని నాయుడుపేటవద్ద సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో జిల్లా నాయకులు నండ్రా ప్రసాద్, ప్రతాపనేని వెంకటేశ్వర్లు, మోహన్‌రావు, నందిగామ కృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

రాష్ట్రంలోనే మోడల్ నగరంగా ఖమ్మం

● మేయర్ పునుకొల్లు నీరజ



డ్రైయినేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం కార్పొరేషన్, జూలై 9(ఆంధ్రజ్యోతి): మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రత్యేక చొరవతో రాష్ట్రంలోనే మోడల్ నగరంగా ఖమ్మం తీర్చిదిద్దటం జరుగుతుందని ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. బుధవారం 8వ డివిజన్‌లో పర్యటించి నర్సరీల నిర్వాహణ తీరును తనిఖీలు చేశారు. అనంతరం 46వ డివిజన్‌లో డ్రైయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు. కార్పొరేటర్ కన్నం వైష్ణవి, ప్రసన్నకృష్ణ, కాటం కోమరయ్య, దయ్యాల నాగేశ్వరరావు, కాటం యాదయ్య, బాల్దే నాగేశ్వరరావు, కన్నం రమేష్, మంగ యాదయ్య, ఎమ్మె రామకృష్ణ, తుపాకుల మధు, మరాటి బీరేష్, దోమల నాగేశ్వరరావు, సెల్వం జ్ఞానేశ్వర్, సంతోష్, చేతి శ్రీనివాస్, నర్సింహారావు, కొక్కిరేణి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ, గంగయ్య, మీర్జా అజీబులా బెగ్ పాల్గొన్నారు.

'యూనిటీ ఆఫ్ మాల'తోనే ఐక్యత సాధ్యం



మాట్లాడుతున్న కార్పొరేటర్ బీజీ క్లైమెంట్

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై9(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో ఉన్న మాలజాతిని ఐక్యం చేయడం కోసం ఖమ్మం నడిబొడ్డున ఆ విర్భవించిందే యూనిటీ ఆఫ్ మాల అని, మాలల ఐక్యత యూనిటీ ఆఫ్ మాలతోనే సాధ్యం అని యూనిటీ ఆఫ్ మాల స్టీరింగ్ కమిటీ సభ్యుడు, నగర కార్పొరేటర్ బీజీ క్లైమెంట్ అన్నారు. యూనిటీ ఆఫ్ మాల 5వ ఆవిర్భావ సభ నగరంలోని అంబేద్కర్ భవన్‌లో బుధవారం నిర్వహించారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కందుల ఉపేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అవుట మధు, గులగట్టు యల్లయ్య, చిలకబత్తిని కనకయ్య, తెలగమళ్ల గోవింద్, జాగటి మధు పాల్గొన్నారు.

ఆరు నెలలకు రెట్టింపు డబ్బుల పేరిట మోసం

» ఖమ్మానికి చెందిన ఒకరి అరెస్టు

కరీంనగర్ క్రైం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): తమ సంస్థలో పెట్టుబడి పెడితే ఆరు నెలలకు రెట్టింపు డబ్బులు ఇస్తామని చెప్పి ఆన్‌లైన్‌లో ప్రకటనలు ఇచ్చి రూ.కోటి వరకు వసూలు చేశారు. చివరికి మోసం చేయడంతో బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఈ కేసులో పోలీసులు ఒకరిని అరెస్టు చేసి కరీంనగర్ కోర్టులో బుధవారం హాజరుపరిచారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన గంటల నవీన్, నజీర్.. గోల్డ్ మైన్స్, స్క్రాప్ బిజినెస్‌లో పెట్టుబడి పెడితే ఆరు నెలల్లో రెట్టింపు డబ్బులిస్తామని ఆన్‌లైన్‌లో ప్రకటనలిచ్చారు. ఈ ప్రకటనలకు ఆకర్షితులైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన పలువురు దాదాపు రూ.కోటి వరకు డబ్బులు పెట్టుబడి రూపంలో ఆ సంస్థ ఖాతాకు పంపించారు. ప్రారంభంలో ఒకరిద్దరికి చిన్న మొత్తంలో ఆరు నెలల్లో రెట్టింపు డబ్బులు ఇచ్చారు. దీంతో చాలా మంది పెట్టుబడి పెట్టారు. పెట్టుబడి పెట్టినవారిని గోవా టూర్‌కు కూడా తీసుకెళ్లారు. కొద్దిరోజుల తరువాత ఆ సంస్థను మూసివేసిన నవీన్, నజీర్ పెట్టుబడిదారులకు డబ్బులు చెల్లించకుండా మోసం చేశారు. దీనిపై కరీంనగర్ జిల్లాకు చెందిన ముగ్గురు బాధితులు స్థానిక సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటికే ఇదే మోసానికి సంబంధించి నవీన్, నజీర్‌పై ఖమ్మంలో రెండు కేసులు నమోదయ్యాయి. కరీంనగర్‌లో తాజాగా సైబర్‌క్రైం పోలీసులు నవీన్, నజీర్‌తోపాటు ఖమ్మానికి చెందిన రాంచంద్రమూర్తిపై కూడా కేసు నమోదు చేశారు. ప్రస్తుతం నజీర్ పరారీలో ఉన్నాడు. రాంచంద్రమూ ర్తి బ్యాంక్ ఖాతాలోకి రెండు విడతలుగా రూ.10 లక్షలు ట్రాన్స్‌ఫర్ అయినట్లు పోలీసులు గుర్తించారు. నవీన్‌తో రాంచంద్రమూర్తి గోవాటూర్‌కు వెళ్లినట్టుగా విచారణలో తేలింది. దీంతోపాటు అతడి ఖాతా లో ఏడాదిగా రూ.కోటి 80 లక్షల వరకు లావాదేవీలు జరిగినట్టు గుర్తించారు. ఈ మేరకు రాంచంద్రమూర్తిని కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు ఖమ్మంలో అరెస్టు చేసి బుధవారం కోర్టులో హాజరుపరిచారు.

ఓటర్ల జాబితాను పకడ్బందీగా నిర్వహించాలి



మాట్లాడుతున్న పాలేరు ఎన్నికల అధికారి రాజేశ్వరి

నేలకొండపల్లి, జూలై9(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాను సమగ్రంగా రూపొదించాలని పాలేరు నియోజకవర్గ ఎన్నికల అధికారి రాజేశ్వరి బీఎల్‌ఓలను ఆదేశించారు. సోమవారం నేలకొండపల్లిలో జరిగిన బీఎల్‌ఓల శిక్షణా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉద్దేశ్యపూర్వకంగా లేదా నిర్లక్ష్యంతో తప్పు చేసే బీఎల్‌ఓలకు 1950 చట్టంలోని 32 సెక్షన్ ప్రకారం శిక్ష ఉంటుందనే విషయాన్ని బీఎల్‌ఓలు గుర్తుంచుకోవాలన్నారు. ఓటర్ల లిస్టును శుద్ధి చేసే కార్యక్రమంలో భాగంగా బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి వెళ్లి పూర్తిస్థాయిలో వివరాలు సేకరించాలన్నారు. ఇంట్లో ఎంత మంది ఉన్నారు?పేరు ఏమైనా తప్పుగా నమోదైందా?విదేశాల్లో ఎవరైనా ఉన్నారా? ఉంటే వారు ఓటు వేయటానికి వచ్చే అవకాశం ఉందా? అనే వివరాలు సేకరించాలన్నారు. ప్రతి ఇంటిలో అన్ని విషయాలను సమగ్రంగా తెలుసుకుని ఓటర్ల జాబితాలో మార్పులు చేయాలన్నారు. ఓటర్లను నమోదు చేయడంలోనూ, తొలగించడంలోనూ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలన్నారు. శిక్షకులు శిచ్చే శిక్షణను బీఎల్‌ఓలు సద్వినియోగం చేసుకోవాలని రాజేశ్వరి బీఎల్‌ఓలను కోరారు. తొలపనూరి రత్నకుమార్, పెద్ది జగన్నాధం, శ్రావణ్‌కుమార్‌లు బీఎల్‌ఓలకు శిక్షణ ఇచ్చారు. శిక్షణా కార్యక్రమానికి ఇన్‌చార్జిగా తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు వ్యవహరించారు. మధుసూదన్ రావు, రవి, పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



సరోజనమ్మ కుటుంబాన్ని పరామర్శిస్తున్న తాతా మధు

తిరుమలాయపాలెం, జూలై9(ఆంధ్రజ్యోతి): మండలంలోని పిండిప్రోలు గ్రామానికి చెందిన కిలారు సరోజనమ్మ మృతిచెందగా ఆమె కుటుంబాన్ని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధు బుధవారం పరామర్శించారు. ఇటీవల సరోజనమ్మ అనారోగ్యంతో మృతిచెందగా ఈవిషయం తెలుసుకున్న మధు ఆయన కటుబసభ్యులను పరామర్శించారు. ఈకార్యక్రమంలో సీహెచ్.రాజు, చంద్రశేఖర్, తాతా రవీందర్, మనోజ్ తదితరులుపాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం




ఫొటోగ్రఫీలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థులు


ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 9(ఆంధ్రజ్యోతి): సినిమాటోగ్రఫీ రంగంలో స్వల్పకాలిక నైపుణ్య కోర్సులకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు చేసుకోవాలని న్యాక్(నేషనల్ అకా డమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్) అసిస్టెంట్ డైరెక్టర్ కె. వెంకటపతి రాజు తెలిపారు. రాష్ట్ర సినిమాటోగ్రఫీ మంత్రి ఆదేశాల మేరకు న్యాక్ ఆధ్వర్యంలో శశి ప్రీతం అకాడమీ ఆఫ్ సినిమా అండ్ ఎంటర్ టైన్ మెంట్ సౌజన్యంతో 12 వారాల పాటు సినిమాటోగ్రఫీ, వీడియో ఎడిటింగ్, సౌండ్ రికార్డింగ్, డబ్బింగ్ అండ్ వాయిస్ ఓవర్ స్కిల్, యాంకరింగ్, డిజిటల్ డిజైన్, మ్యూజిక్ ప్రొడక్షన్, ప్రొఫెషనల్ సింగింగ్, ప్రొడక్షన్ మేనేజ్మెంట్, అకౌస్టిక్ డిజైన్ వంటా కోర్సులలో నైపుణ్య శిక్షణ అందించటం జరుగుతుందని తెలిపారు. బుధవారం నగరంలోని టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐ కళాశాల విద్యార్థులకు పలు కోర్సులపై శిక్షణ అందించారు. 14ఏళ్లు పూర్తి చేసుకున్న ఆసక్తి గల అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు 9059310315 నెంబరును సంప్రదించాలని అన్నారు.

ఆర్థికసాయం అందజేత

తిరుమలాయపాలెం, జూలై9(ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లో ఇటీవల మృతిచెందిన పలు మృతుల కుటుంబాల సభ్యులకు బుధవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అందించిన ఆర్థికసాయాన్ని జిల్లా కాంగ్రెస్ నాయకులు రామసహాయం నరేష్ రెడ్డి అందించారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. ఈకార్యక్రమంలో ఆత్మకమిటీ చైర్మన్ చావా శివరామకృష్ణమాజీ ఎంపీపీ బోడ మంగిలాల్, ఉన్నం రాజశేఖర్, ఓర వెంకటేశ్వర్లు, అంబేద్కర్, శ్రీనివాసరెడ్డి, పాల్గొన్నారు.







ఘనంగా సీతక్క జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేస్తున్న రాములు

వైరా, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వైరాలో బుధవారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి దనసరి అనసూర్య(సీతక్క) జన్మదిన వేడుకలను రాష్ట్ర మిషన్ భగీరథ ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు తలారి రాములు ఆధ్వర్యంలో నిర్వహించారు. వైరా సబ్‌డివిజన్ అధ్యక్షుడు పర్సా రవి, నాయకులు కోపూరి నాగేశ్వరరావు, చిత్తారపు రాజబాబు, మూడుముంతల గోపి, సైదులు, గుడిమళ్ల జ్ఞానరత్నం పాల్గొన్నారు.

దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం


తల్లాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వామపక్షనాయకులు

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని ఇచ్చిన దేశవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం చేపట్టిన ఒక్కరోజు సార్వత్రిక సమ్మె వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో విజయవంతమైంది. తెల్లవారుజాము నుంచే ఆర్టీసీ డిపో నుంచి బస్సులు బయటకు రాకుండా అఖిలపక్ష నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పలు పార్టీల ఆధ్వర్యంలో సమ్మెలో భాగంగా హోటళ్లు, దుకాణాలు, పలు వ్యాపార సంస్థలతోపాటు ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, పాఠశాలలను బంద్ చేశారు. పలు గ్రామాల్లో సీపీఎం, ఐద్వా నాయకులు ట్రాక్టర్లతో ర్యాలీ తీశారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలను మార్చుకోవాలని, కార్మిక చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలని కోరారు. శాంతియుత సమ్మెలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అఖిలపక్ష నాయకులు ఈ సందర్భంగా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



ఏన్కూరులో ఆందోళన చేస్తున్న అఖిలపక్ష నాయకులు


కొణిజర్లలో సమ్మె చేస్తున్న అఖిలపక్ష నాయకులు



మధిరలో నిరసన చేస్తున్న అఖిలపక్షం నాయకులు


చింతకానిలో ధర్నా నిర్వహిస్తున్న నాయకులు



సత్తుపల్లి పట్టణంలో ర్యాలీ తీస్తున్న కార్మికులు, నాయకులు


వైరాలో హైవేపై నిరసన తెలియజేస్తున్న సంఘాల నాయకులు


బోనకల్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న అఖిలపక్ష నాయకులు

రైతులకు విత్తనాల పంపిణీ


విత్తన ప్యాకెట్లను అందజేస్తున్న ఎమ్మెల్యే

సత్తుపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని సత్తుపల్లి, వేంసూరు, పెనుబల్లి మండలాల నుంచి ఎంపికైన అభ్యుదయ రైతులకు విత్తనాల ప్యాకెట్లను సత్తుపల్లి ఎమ్మెల్యే డా.మట్టా రాగమయి అందజేశారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో 32 విత్తన ప్యాకెట్లను 100శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేశారు. ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం రుణమాఫీ, రైతుభరోస, రైతుబీమా వంటి అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని, కేవలం వరిసాగు మాత్రమే కాకుండా ఆయిల్‌పామ్ వంటి పంటలను సాగు చేసి వ్యవసాయంలో లభాలు పొందాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం పట్టణంలోని 17వ వార్డులోని ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. ఏవోలు వై.శ్రీనివాసరావు, రామ్మోహన్, ప్రసాదరాజు, ఏఈవోలు నరేష్, సాయి వాసంతిలతో పాటు నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, గాదె చెన్నారావు, నాయకులు పాల్గొన్నారు.

యువతకు స్వయం ఉపాధి


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న రాందాస్‌నాయక్

వైరా, జూలై 9 (ఆంధ్రజ్యోతి): యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ సూచించారు. యువత స్వయం ఉపాధి కోసం ఆరోగ్యమిత్ర కోఆర్డినేటర్ ఉద్యోగ అవకాశాలను వినియోగించుకోవాలన్నారు. గరుడ స్వచ్ఛంద సంస్థ సహకారంలో ఆరోగ్యమిత్ర డిజిటల్ హెల్త్ కోఆర్డినేషన్ ఉపాధి అవకాశాల బ్రోచ్‌ను బుచర్‌ను వైరాలో ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ఆవిష్కరించారు. ఈనెల 15వతేదీలోగా స్వయం ఉపాధి కోసం యువత దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. ఈ సందర్భంగా నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆరోగ్య మిత్ర డిజిటిల్ హెల్త్ కోఆర్డినేషన్ ద్వారా 150మందికిపైగా ఉపాధి అవకాశాలు పొందే అవకాశముందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంస్థ మేనేజర్ నర్సింహారావు, వైరా ఎస్ఐ పి.రామారావు, కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు, కాంగ్రెస్ వైరా పట్టణ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, నాయకులు కోసూరి శ్రీనివాసరావు, దార్న రాజశేఖర్, స్వర్ణ నరేందర్, తోటకూర గోపి, జవ్వాజి నాగరాజు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గంగారం రింగ్ సెంటర్

సత్తుపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారిలో సత్తుపల్లి మండలం గంగారం సెంటర్‌లో నిర్మించిన సర్కిల్ వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు, వాహన చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సర్కిల్ మరీ పెద్దగా ఉండడం వల్ల టర్న్ తీసుకునేప్పుడు వాహనాలు కూడా ఢీకొడుతున్నాయని, సరిగా నిర్మించకపోవడం వల్లే ప్రమాదాలు జరుగుతున్నాయని అధికారులు దీనిని సరి చేయాలని కోరుతున్నారు.

సైబర్ నేరాలపట్ల అవగాహన పెంచుకోవాలి

తల్లాడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజురోజుకు మితిమీరిపోతున్న సైబర్ నేరాలపట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకుని జాగ్రత్తపడాలని ఎస్ఐ వెంకటకృష్ణ అన్నారు. బుధవారం తల్లాడలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో అనేక అప్లికేషన్లు తయారుచేసి వాట్సాప్‌లో మెసేజ్‌లు పంపుతూ సైబర్ మోసాలకు పాల్పడుతున్నరని వీటిపట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎవరైన మోసం జరిగితే వెంటనే 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కానిస్టేబుల్స్ నరేష్, హరిదాసు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువుల నిల్వలు

» జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య

సత్తుపల్లిరూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఈ వానాకాల సీజన్‌కు సరిపడా ఎరువుల నిల్వలు అందుబాటులో ఉన్నాయని జిల్లా వ్యవసాయాధికారి పుల్లయ్య తెలిపారు. బుధవారం ఆయన ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎరువుల డీలర్లు ఎమ్మార్పీకి మించి అధిక ధరలకు విక్రయించరాదని, ఒక ఎరువు రకం కొనుగోలు చేస్తే మరోకటి కొనమని రైతులను ఒత్తిడి చేయవద్దని, రైతులు అడిగిన వాటిని మాత్రమే విక్రయించాలని డీలర్లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మండల ఏవో వై.శ్రీనివాసరావు ఉన్నారు.

వాహన్‌బజార్ ఇంటర్వ్యూలలో మదర్‌థెరిస్సా కాలేజీ విద్యార్థుల ప్రతిభ

సత్తుపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌కు చెందిన వాహన్‌బజార్ సంస్థ బుధవారం నిర్వహించిన ఇంటర్వ్యూలలో కొత్తూరులోని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 14మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ ఇంటర్వ్యూకు 50మంది పాల్గొన్నారని, ఎంపికైన ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.3.6నుంచి రూ.5లక్షల వరకు వేతనం ఆ సంస్థ ఇవ్వనుందని కాలేజీ ప్రిన్సిపాల్ హరికృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ చలసాని సాంబశివరావు, ప్లేస్‌మెంట్ అధికారి రాఘవరాజు, వివిధ విభాగాల అధిపతులు అభినందనలు తెలిపారు.

బీఎల్‌వోలు సమర్థవంతంగా పనిచేయాలి

తల్లాడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఓటర్లజాబితాలను రూపొందించడంలో బూత్‌లెవల్ అధికారులు నిష్పక్షపాతంగా వ్యవరించాలని కల్లూరు ఆర్డీవో రాజేంద్రగౌడ్ అన్నారు బుధవారం తల్లాడ రైతువేదికలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం ప్రారంభించారు. ఓటర్ల జాబితాల తయారీ సమగ్రంగా ఉండాలని ఆయన తెలిపారు. అర్హులందరికీ ఓటు హక్కు కలిపించాల్సిన బాధ్యత బీఎల్‌వోలదేనన్నారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ బాబ్జి ప్రసాద్, షేక్ ఇమ్రాన్, భాస్కర్, ఖాజామోహినుద్దీన్, అశోక్, చెన్నకేశవరెడ్డి, మధుసూధనాచారి పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ఆర్యవైశ్య సంఘం


ఆర్థికసాయం అందజేస్తున్న ఆర్యవైశ్యసంఘం నాయకులు

వైరా, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మిట్టపల్లి కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో బుధవారం పలు సేవ కార్యక్రమాలు నిర్వహించారు. దినేష్, కుంతిమళ్ల భాస్కర్‌రావు పుట్టినరోజు సందర్భంగా దాతల సహకారంతో బాధితుడైన అయిన బుసా రాంబాబు కుటుంబానికి రూ.24వేల ఆర్థికసహాయాన్ని అందజేశారు. అలాగే విద్యార్థులకు బ్యాగులు, యూనిఫాం, పేద మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. విశ్వేశ్వరరావు, కృష్ణమూర్తి, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, ప్రసాద్, నాగేశ్వరరావు, సత్యంబాబు, జనార్ధన్, కృష్ణమూర్తి, ఉపేంద్రరావు, చక్రవర్తి పాల్గొన్నారు.

వైరా కాల్వలను పరిశీలించిన ఎస్ఈ

వైరా, జూలై 9 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్, కుడి, ఎడమకాల్వలను బుధవారం నీటిపారుదలశాఖ ఖమ్మంజిల్లా ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈఈ కె.బాబూరావు, డీఈఈ పి.శ్రీనివాస్‌తో కలిసి మొదట రిజర్వాయర్‌ను సందర్శించారు. రిజర్వాయర్ నీటిమట్టాన్ని పరిశీలించారు. 'నీటివిడుదల కోసం ఆయకట్టు రైతుల ఎదురుచూపు' అనే శీర్షికన 'ఆంధ్రజ్యోతి' కథనాన్ని ఎస్ఈ వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా ఈఈ, డీఈలతో ప్రస్తావించారు. నీటివిడుదలకు గల అవకాశాలను పరిశీలించాలని సూచించారు. ఆతర్వాత వైరా కుడి, ఎడమ కాల్వల్లో చేపట్టిన రెండో దశ ఆధునీకరణ పనులను పరిశీలించారు. పూర్తయిన నిర్మాణాలు, మిగిలిన ఉన్న పనుల గురించి ఆరా తీశారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం పూర్తిచేయాలి

తల్లాడ, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేయాలని కల్లూరు ఆర్డీవో రాజేందర్‌గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని బిల్లుపాడు గ్రామానికి మంజూరైన 24 ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణం చేపట్టడం పట్ల సంతృప్తి వ్యక్తంచేశారు. సాంకేతిక సమస్యకారణంగా తమ ఖాతాల్లో డబ్బులు జమకాలేదని ఇద్దరు లబ్ధిదారులు ఆర్డీవో దృష్టికితేగా ఈవిషయమై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషిచేస్తాని హామి ఇచ్చారుక. ఈకార్యక్రమంలో ఎంపీడీవో సురేష్‌బాబు హైజింగ్ ఏఈ అస్మా మండల కాంగ్రెస్ నాయకులు జక్కంపుండి కిషోర్, చంద్రశేఖర్, సామినేని రామ అప్పారావు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి తహసీల్దార్‌గా రమేష్



కారేపల్లి జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండల తహసీల్దార్‌గా అనంతుల రమేష్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. కల్లూరు రెవిన్యూ డివిజనల్ కార్యాలయంలో డీఏవోగా పనిచేస్తున్న రమేష్ కారేపల్లి మండలానికి తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు మండల తహసీల్దార్‌గా పనిచేసిన ఎస్ సంపత్‌కుమార్ మహబూబాబాద్ జిల్లాకు బదిలీపై వెళ్ళడంతో అనంతల రమేష్ మండలానికి వచ్చారు.

దాడి చేసినవారిపై చర్యలు తీసుకోవాలి

కారేపల్లి, జూలై 9 (ఆంధ్రజ్యోతి): దేవాదాయ దర్మాదాయశాఖకు చెందిన అధికారులపై దాడికిపాల్పడినవారిని ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని మండల కేంద్రంలోని దేవాదాయశాఖ సిబ్బంది నల్లబ్యాడ్జిలు ధరించి నిరరసన కార్యక్రమం చేపట్టారు. పురుషోతమ పట్టణంలో కొందరు దేవదాయ శాఖకు చెందిన భూములను అక్రమించుకున్నారని తెలిసి అక్కడకు వెళ్ళిన కార్యనిర్వహణ అధికారి ఎల్.రమాదేవిపై దాడి చేయడం సరికాదని మోహన్ అన్నారు. దాడికి పాల్పడినవారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పూజరి సతీష్ పాల్గోన్నారు.

సీపీఐ మండల కార్యదర్శిగా పాపినేని

కారేపల్లి జూలై 9 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల కార్యదర్శిగా పాపినేని సత్యానారాయణ, సహాయ కార్యదర్శులుగా చెన్ననేని భూషయ్య, దళసింగ్‌లు ఎకగ్రీవంగ ఎన్నికైయ్యారు. బుధవారం మండల పరిధిలోని మాధారం గ్రామంలో జరిగిన పార్టీ 17వ మండలమహాసభలో సభ్యులు నూతన కమిటిని ఎన్నుకున్నారు.మొత్తం 17 మంది సభ్యులతో కమిటీని ఎన్నుకున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల బరిలో సీపీఐ

వైరా, జూలై 9 (ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ పోటీ చేస్తుందని ఆపార్టీ జాతీయ కమిటీ సభ్యుడు బాగం హేమంతరావు, జిల్లా సహాయ కార్యదర్శి బండి సురేష్ ప్రకటించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు పార్టీ నాయకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో సీపీఐ బలోపేతం కోసం పార్టీ కార్యకర్తలు కృషిచేయాలన్నారు. బుధవారం వైరాలో జరిగిన సీపీఐ మండల మహాసభలో వారు మాట్లాడారు.

ఐదుగురు పేకాటరాయుళ్ల అరెస్టు

ఎర్రుపాలెం, జూలై 9 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చిరెడ్డిపాలెం గ్రామ శివారులో పేకాట ఆడుతుండగా 5గురు వ్యక్తులను ఎర్రుపాలెం పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి.. బుచ్చిరెడ్డిపాలెం గ్రామంలోని ఓ ప్రాంతంలోని అదే గ్రామానికి చెందిన 5గురు వ్యక్తులు పేకాట ఆడుతుండగా స్థానికుల సమాచారం మేరకు స్థావరంపై దాడిచేసి 5 గురు నిందితులను పట్టుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని, ఈ దాడిలో రూ.13,980 నగదు, ఒక మోటారుసైకిల్, ఐదుసెల్‌ఫోన్లు పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిరంతరాయ విద్యుత్ సరఫరాకు చర్యలు

» విద్యుత్ శాఖ సబ్ డివిజన్‌లో రూ.1.5కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం

» విద్యుత్ శాఖ ఎస్ఈ శ్రీనివాసాచారి

సత్తుపల్లిరూరల్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): అదనపు, ప్రత్యామ్నాయంగా చేపట్టే పనులతో విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయవచ్చునని ఎస్ఈ శ్రీనివాసాచారి అన్నారు. సత్తుపల్లి విద్యుత్ శాఖ సబ్ డివిజన్ పరిధిలోని సుమారు రూ.1.5కోట్ల అభివృద్ధి పనులను ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేంసూరు మండలంలోని 33/11 కేవీ లింగపాలెం సబ్‌స్టేషన్‌కు ప్రత్యామ్నాయంగా 33కేవీ విద్యుత్ లైన్‌ను సుమారు రూ.25లక్షల వ్యయంతో నిర్మించగా వినియోగంలోకి తేచ్చామన్నారు. ఈ ప్రత్యామ్నాయ లైన్‌తో ప్రస్తుతం ఉన్న 33కేవీ లైన్‌లో ఏమైనా సాంకేతిక సమస్యలు తలెత్తినా, నిర్వహణ నిమిత్తం ఎల్‌సీ (లైన్ క్లియర్) తీసుకున్న సమయంలో ఈ ప్రత్యామ్నాయ లైన్ ద్వారా విద్యుత్ సరఫరాను పునరుద్ధరించవచ్చునన్నారు. బీరాపల్లి సబ్‌స్టేషన్‌లో సుమారు రూ.1.10కోట్ల వ్యయంతో అదనపు 5ఎంవీఏ పీటీఆర్‌ను ప్రారంభించామన్నారు. పెనుబల్లి మండలంలోని లంకాసాగర్ సబ్‌స్టేషన్‌లో సుమారు రూ.13లక్షల వ్యయంతో నిర్మించిన అదనపు ఫీడర్, ఫీడర్ బ్రేకర్లను ఏర్పాటు చేయగా ప్రారంభించి వినియోగంలోకి తెచ్చామన్నారు. ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలోని గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా అందించవచ్చన్నారు. ఎప్పటికప్పుడు పెరుగుతున్న విద్యుత్ లోడ్‌కు అనుగుణంగా ముందస్తు ప్రణాళికతో నాణ్యమైన నిరంతరాయమైన విద్యుత్ సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటామని, వినియోగదారులు సహకరించాలని ఎస్ఈ కోరారు.

